


మహాత్ముని జీవితం తెరిచిన పుస్తకం..

ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో మహాత్మాగాంధీ జీవిత చరిత్రపై తెలుగు, హిందీ, ఆంగ్ల భాషల్లో సుమారు 500 పుస్తకాలున్నాయి. మహాత్ముని జీవితాన్ని అధ్యయనం చేసే వారికి సౌలభ్యంగా ఉండేందుకు వీటన్నింటిని ఓ ప్రత్యేక విభాగంగా ఉంచారు. దేశ సంగ్రామ చరిత్రలో గాంధీజీ ప్రత్యేకత తెలిపే ఎన్నో పుస్తకాలు పాఠకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. -ఈనాడు, విశాఖపట్నం

నిలిచిన రేషను డిపోల పునర్విభజన

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలో రేషను డిపోల పునర్విభజన ప్రక్రియ నిలిచిపోయింది. 800 రేషను కార్డులు పైబడిన డిపోలను పునర్ వ్యవస్థీకరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అధికారికంగా ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రభుత్వం జారీ చేసిన జీఓను రద్దు చేయాలని కోరుతూ పలువురు డీలర్లు హైకోర్టుకు వెళ్లారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఉత్తర్వుల అమలును నిలిపివేస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసిందని జిల్లా రేషను డీలర్ల సంఘం అధ్యక్షుడు పద్మనాభం చిట్టిరాజు తెలిపారు.

జిల్లాలో..

97.39 శాతం మందికి పింఛన్ల పంపిణీ

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలో తొలిరోజు 97.39 శాతం మందికి పింఛన్లు అందజేశారు. మంగళవారం ఉదయం 6 నుంచి సాయంత్రం 6గంటల వరకు నిరంతరాయంగా ఈ పంపిణీ కొనసాగింది. సచివాలయ ఉద్యోగులు, కూటమి పార్టీల నాయకులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. అక్టోబరు 2వ తేదీ గాంధీ జయంతి కారణంగా సెలవు దినమైనందున మిగిలిన పింఛనుదారులకు 3వ తేదీ పంపిణీ చేయనున్నారు. జిల్లాలో 1,62,490 మంది పింఛనుదారులు ఉన్నారు. వీరిలో 1,58,244 మందికి రూ. 67.96 కోట్లు పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో 26,021 మందికి, నగర పరిధిలో 1,32,223 మందికి అందజేశామని డీఆర్‌డీఏ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

వసూళ్ల పర్వం.. అక్రమాలే సర్వం!!

ఈనాడు-విశాఖపట్నం



న్యూస్‌టుడే, కార్పొరేషన్

యూసీడీలో అంతులేని అవినీతిపై ప్రకంపనలు

మహా విశాఖ నగరపాలక సంస్థ యూసీడీ (పట్టణ సామాజికాభివృద్ధి)లో అక్రమాలు చోటు చేసుకున్నాయి. వైకాపా పాలనలో గుట్టు చప్పుడు కాకుండా నిధులు మింగేశారు. అంతేనా..? ఫిర్యాదులపై విచారణ చేయకుండా ఏకంగా ప్రథమ పౌరురాలైన మేయర్‌కు, గత కమిషనర్‌కే లంచాలిచ్చారంటూ వచ్చిన ఆరోపణలు జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో ప్రకంపనలు రేపాయి. తెర వెనుక నడిచిన వ్యవహారాలు ఏమేమి ఉన్నాయనే కోణంలో కూటమి ప్రభుత్వం దృష్టిసారించింది.

పారిశుద్ధ్య కార్మికుల డబ్బులకీ టోకరా

జీవీఎంసీలో 2019-2020, 2020-2021 ఆర్థిక సంవత్సరాల్లో పారిశుద్ధ్య కార్మికుల వేతనాలను ఎస్‌ఎల్‌ఎఫ్ (స్లమ్ లెవల్ ఫెడరేషన్)ల ద్వారా అందజేశారు. కార్మికుల వేతనం నుంచి ఆదాయపు పన్నుగా ఒక్కొక్కరి నుంచి నెలకు రూ. 250 చొప్పున వసూలు చేసి చెల్లించారు. అనంతరం వారు పన్ను పరిధిలోకి రారని, జీవీఎంసీ ఆదాయపు పన్నుశాఖ దృష్టికి తీసుకెళ్లగా రూ. 3.58 కోట్లు ఎస్‌ఎల్‌ఎఫ్‌లకు మళ్లించారు. మరో రూ. 4 కోట్లు వరకు రావాల్సి ఉంది. వచ్చిన నిధులను కార్మికుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉన్నా, యూసీడీ సీవోలు, క్షేత్రస్థాయి సిబ్బంది సహకారంతో పంచుకున్నారన్న ఆరోపణలున్నాయి.

● నిధులు కార్మికులకు ఎందుకు అందజేయలేదని కార్పొరేటర్లు ప్రశ్నిస్తే?.. కార్మికులు ఎవరనే విషయం ఇంకా నిర్ధారించలేదంటూ అధికారులు బదులివ్వడం గమనార్హం. ఇందులో ప్రజారోగ్య విభాగాధికారుల నిర్లక్ష్యం కళ్లకు కట్టినట్లు కనిపిస్తోంది. అప్పటి వైకాపా ప్రభుత్వ మెప్పు పొందడానికి కార్మికుల నిధుల్లో రూ. 50 లక్షలు నిబంధనలకు విరుద్ధంగా ఓ బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసినట్లు తెలుస్తోంది.

అక్రమాలు ఎన్నో.. కరోనా సమయంలో మాస్కులు కుట్టే పని రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలకు అప్పగించింది. అయితే..విజయవాడకు చెందిన ఓ వ్యక్తి పేరిట రూ. 5లక్షలు, మల్కాపురం, ఆరిలోవకు చెందిన మహిళల ఖాతాల్లో రూ. 5 చొప్పున వేసినట్లు ఆధారాలు వెలుగులోకి వచ్చాయి. లక్ష మాస్కులు ఇచ్చేందుకు ప్రభుత్వం నుంచి ఆర్డర్ పొంది, 10వేలు కూడా కుట్టకుండా, రూ. 50లక్షలు వరకు లాగేశారు. విహార యాత్రకు వెళ్లేందుకు దాదాపు వెయ్యి మంది ఆర్పీల నుంచి రూ. 10లక్షలు వైకాపా నాయకులతో కలిసి అధికారులు వసూలు చేసినా.. తరువాత ఆ యాత్ర రద్దయింది. అయినా నిధులు వెనక్కి ఇవ్వలేదు. కొందరు ఆర్‌పీలు ఎస్‌ఎల్‌ఎఫ్ రిజిస్ట్రర్ చేయడానికి ఒక్కొక్కరి నుంచి రూ. 10వేలు, లాగిన్ చేయడానికి రూ. 20వేలు చొప్పున రూ. 1.65కోట్లు వసూలు చేశారన్న విమర్శలున్నాయి.

లంచంపై దుమారం: 20 వేల స్వయం సహాయ సంఘాల విధులు ఆడిట్ చేయాలని రూ. 500 చొప్పున రూ. కోటి వసూలు చేశారు. వాస్తవంగా మహిళా సంఘాల ఆడిట్‌కు పాలకవర్గం అనుమతి అవసరం. ఎలాంటి అనుమతి లేకుండా ఆడిట్ చేయడానికి డబ్బులు వసూలు చేయగా, నేటికీ సంఘాల ప్రతినిధులకు ఆడిట్ ధ్రువీకరణపత్రాలు అందజేయలేదు. దానిపై ఫిర్యాదు రావడంతో విచారణ జరపకుండా ఉండటానికి గత కమిషనర్‌కు రూ. 5లక్షలు, మేయరుకు రూ. 5 లక్షలు, మున్సిపల్‌శాఖ ఉన్నతాధికారికి రూ. 5లక్షలు లంచం ఇచ్చినట్లు ఓ వ్యక్తి ప్రభుత్వానికి అప్పట్లో ఫిర్యాదు చేసినట్లు చెబుతున్న లేఖ కౌన్సిల్‌లో చూపడం కలకలం రేపింది.



పేరుకే వనం.. అంతా కళా విహీనం



ఆర్కేబీచ్‌లో అటు పాండురంగాపురం నుంచి ఇటు వైఎంసీఏ వరకు ఆరు చోట్ల కొబ్బరివనాలు ఏరాటు చేశారు. తీరంలో అలల తీవ్రతకు ఇసుక కోత నివారించడానికి, పర్యాటకులు వీటి నీడలో సేద తీరేందుకు ఉపయోగపడతాయిని అధికారులు భావించారు. అయితే... ఈ వనాల్లో పలు చెట్లు చనిపోయాయి. ఉన్నవి పచ్చదనం కోల్పోయి కళావిహీనంగా మారుతున్నాయి. అధికారులు స్పందించి సంరక్షించాలని, మరిన్ని చెట్లను నాటాలని పర్యాటకులు కోరుతున్నారు. -ఈనాడు, విశాఖపట్నం



ఇల్లే.. ఉద్యానవనం!

ఈనాడు, విశాఖపట్నం

విశాఖపట్నం పెదవాల్తేరు డాక్టర్స్ కాలనీలో ఈ ఇంటిని చూస్తే పచ్చదనంపై వీరికున్న అమితమైన ఆసక్తి ఏమిటో తెలుస్తుంది. ప్రకృతిపై మమకారంతో భవనాన్ని చిన్నపాటి ఉద్యానవనంలా మార్చారు. అటుగా వెళ్లే ప్రతి ఒక్కరు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

రహదారి ప్రమాదాలు తగ్గుముఖం

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : నగర పోలీసు కమిషనరేట్ పరిధిలో ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలనే నిబంధనతోపాటు మోటారు వాహనాల చట్టం నిబంధనలు కచ్చితంగా అమలు చేయటం ద్వారా రహదారి ప్రమాదాలు, మరణాలు తగ్గుముఖం పట్టాయని ట్రాఫిక్ పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబరు 1 నుంచి ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారికి హెల్మెట్‌ధారణ తప్పనిసరి చేస్తూ ముఖ్య కూడళ్లలో అవగాహన చేపడుతున్నామని, నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటున్నామన్నారు.

● ఈ ఏడాది ఆగస్టులో నగర పరిధిలో ఘోర ప్రమాదాలు 27 జరిగితే, 27 మంది మృతిచెందారన్నారు. సెప్టెంబరులో 17 ప్రమాదాలు జరిగి 20 మంది మృతిచెందారన్నారు. ఆగస్టుతో పోలిస్తే, సెప్టెంబరులో ప్రమాదాలు, మృతుల సంఖ్య తగ్గినట్లు మంగళవారం తెలిపారు.

155 మద్యం దుకాణాలకు నోటిఫికేషన్

దరఖాస్తుల స్వీకరణ ఆరంభం

ఈనాడు-విశాఖపట్నం, న్యూస్‌టుడే, మాధవధార

వైకాపా హయాంలో జేబ్రాండ్ల పేరుతో మద్యం అమ్మకాలకు తెర లేపారు. అధిక ధరలు వసూలు చేసినా నాసిరకం మద్యం తాగిన వారు రోగాల పాలయ్యారు. అప్పట్లో ప్రతిపక్షాలు, మద్యం కొనుగోలుదారులు గగ్గోలు పెట్టినా వైకాపా వెనక్కి తగ్గలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మద్యం నాణ్యత, ధరలపై కసరత్తు చేసి నూతన విధానానికి శ్రీకారం చుట్టింది.

రెండేళ్ల కాలపరిమితితో నూతన మద్యం విధానాన్ని ప్రభుత్వం తీసుకొచ్చింది. దరఖాస్తుల స్వీకరణ మంగళవారం నుంచి ప్రారంభమైంది. ఆన్‌లైన్ ద్వారా... అలాగే భీమిలి, సీతమ్మధార, గోపాలపట్నం, గాజువాక, పెందుర్తిలోని ఎక్సైజ్ స్టేషన్లలో దరఖాస్తులను స్వీకరించే ఏర్పాట్లు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో స్టేషన్‌కు ఇద్దరు డిజిటల్ అసిస్టెంట్లను ఏర్పాటు చేశారు. నకిలీ డీడీలు, చెక్‌లను అరికట్టేందుకు బ్యాంకు సిబ్బందిని నియమించారు. 11వ తేదీన వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఏరినాలో లాటరీ తీయనున్నట్లు ఎక్సైజ్ డీసీ శ్రీరామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ ఆర్.ప్రసాద్ తెలిపారు.

గ్రామీణ పరిధిలో ఇలా..

భీమిలి మండల పరిధిలో నాలుగు దుకాణాలు, ఆనందపురం 8, పద్మనాభంలో 7 దుకాణాలు ఏర్పాటు చేయనున్నారు. జనాభాను బట్టి నాలుగు స్లాబుల్లో లైసెన్సుల రుసుం ఖరారు చేశారు. ఈ నేపథ్యంలో గ్రామీణ పరిధిలో రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ ఒక్కో దుకాణానికి రూ. 65లక్షలు, రెండో ఏడాది పది శాతం పెరుగుదలతో రూ. 71.50లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. జీవీఎంసీ పరిధిలో ఒక్కో దుకాణానికి రూ. 85లక్షల చొప్పున రుసుం చెల్లించాల్సి ఉంటుంది.



ఎక్సైజ్ డీసీ డి.శ్రీరామ చంద్రమూర్తి



సూపరింటెండెంట్ ఆర్.ప్రసాద్

సిండికేటుగా పావులు: కీలక ప్రాంతాల్లో, భారీ అమ్మకాలు జరిగే దుకాణాలపై కొందరు వ్యాపారులు దృష్టి పెట్టారు. ఆయా మద్యం దుకాణాలను సిండికేట్‌గా



దక్కించుకునేందుకు పావులు కదుపుతున్నారు. మరోవైపు వైకాపా నాయకులు, ఇటీవల కూటమి తీర్థం పుచ్చుకున్న కొందరు కలిసి సిండికేట్‌గా పాల్గొనేందుకు అడుగులు వేస్తున్నారు. ఒకే వ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా చేసుకోవచ్చనే నిబంధనతో పెట్టుబడులు, వాటాలపై ప్రత్యేక సమావేశాలు సైతం నిర్వహిస్తున్నారు.

మొత్తం నోటిఫై చేసిన మద్యం షాపులు:	155
జీవీఎంసీ పరిధిలో దుకాణాలు:	136
ఇందులో అనకాపల్లి జిల్లావి:	12 (దరఖాస్తుల స్వీకరణ, లాటరీ విశాఖ ఎక్సైజ్ పరిధిలోనే జరుగుతుంది. ప్రక్రియ పూర్తయ్యాక లైసెన్సులు మాత్రం అనకాపల్లి నుంచి ఇస్తారు)
విశాఖ గ్రామీణం పరిధిలో దుకాణాలు:	19
తొలి రోజు వచ్చిన దరఖాస్తులు:	0

ఉక్కు ఒప్పంద కార్మికుల ఆందోళన

రెగ్యులర్ పాస్‌ల జారీకి డిమాండ్


ఉక్కునగరం, న్యూస్‌టుడే : విశాఖ ఉక్కు కర్మాగారంలో ఒప్పంద కార్మికులకు తక్షణమే రెగ్యులర్ పాస్‌లు జారీ చేయాలని కోరుతూ సుమారు 4 వేల మంది మంగళవారం ఈడీ(వర్క్స్) కార్యాలయాన్ని ముట్టడించారు. ఉక్కులో అదనంగా ఉన్న 4200 మంది ఒప్పంద కార్మికుల్ని తక్షణమే విధులకు రాకుండా నిలిపేయాలని వారం కిందట ఉక్కుమంత్రిత్వ శాఖ కార్యదర్శి నుంచి ఆదేశాలు వచ్చాయి. స్పందించిన యాజమాన్యం ఆయా కార్మికుల పాస్‌లను రాత్రికి రాత్రే ఆన్‌లైన్‌లో రద్దు చేసింది. తర్వాత రోజు విధులకు హాజరైన కార్మికులకు అసలు విషయం తెలియడంతో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. దీంతో తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎంపీ శ్రీభరత్ కార్మికుల సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యపై ముఖ్యమంత్రి కేంద్ర ఉక్కు మంత్రితో మాట్లాడారు. నాటి నుంచి కార్మికులు విధులకు హాజరవుతున్నారు. రద్దు చేసిన పాస్‌లు పునరుద్ధరించాలని, బయోమెట్రిక్‌లో తమ పేర్లు ఉంచాలని కార్మికులు కోరుతున్నా ఉక్కు యాజమాన్యం పట్టించుకోవడం లేదు. మంగళవారం సంబంధిత అధికారులు తాత్కాలిక పాస్‌లు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశారు.



ధర్నాకు హాజరైన ఒప్పంద కార్మికులు

● యాజమాన్యం తీరుపై మండిపడిన కార్మికులు ఉదయం 11 గంటలకు ఈడీ(వర్క్స్) కార్యాలయాన్ని దిగ్బంధించి, భవనంపైకి రాళ్లు రువ్వారు. కార్యాలయ అధికారులు, సిబ్బంది బయటకు వెళ్లకుండా తలుపులు మూసేసి, అక్కడే బైఠాయించారు. అనంతరం జరిగిన చర్చల్లో రెగ్యులర్ పాస్‌ల మంజూరుకు, బయోమెట్రిక్‌లో పేర్ల నమోదుకు అధికారులు అంగీకరించి, ఏసీపీ (సౌత్) త్రినాథ్ ఆధ్వర్యంలో నోట్ తయారు చేశారు. ఆ నోట్‌పై అధికారులు, ఉక్కు డైరెక్టర్లు సంతకాలు చేసినా.. సీఎండీ మాత్రం సంతకం చేయలేదు. దీంతో కార్మికులు రాత్రి వరకు ఆందోళన కొనసాగిస్తూనే ఉన్నారు. ఉక్కు శాఖ నుంచి ఆదేశాలు లేకుండా పాత పద్ధతిలో కార్మికులను కొనసాగించలేమని సీఎండీ ఎ.కె.సక్సేనా చెబుతున్నట్టు సమాచారం.

సరకు రవాణాలో విశాఖ పోర్టు రికార్డు



వన్‌టౌన్, న్యూస్‌టుడే: 'విశాఖ పోర్టు అథారిటీ 2024-25 ఆర్థిక సంవత్సరం తొలి అర్థభాగంలో 41.79 మిలియన్ మెట్రిక్ టన్నుల సరకు రవాణా చేసి రికార్డు సృష్టించింది. 2023-24 ఆర్థిక సంవత్సరం ఇదే సమయంలో 39.60 మిలియన్ మెట్రిక్ టన్నుల సరకును రవాణా చేసింది. దీంతో ఈ ఆర్థిక సంవత్సరం తొలి అర్ధ సంవత్సరంలో 6శాతం వృద్ధి నమోదు చేసినట్లయింద'ని పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్ తెలిపారు. క్రూడాయిల్, ఎల్పీజీ, బొగ్గు, ఇతర వస్తువుల హ్యాండ్లింగ్‌లో పెరుగుదల నమోదైందన్నారు. తద్వారా దేశంలోని ప్రముఖ పోర్టుల్లో తన స్థానాన్ని వీపీఏ మరింతగా బలోపేతం చేసుకుందన్నారు. ప్రధానమంత్రి సంకల్పించిన వికసిత్ భారత్-2047కు అనుగుణంగా విశాఖ పోర్టు పచ్చదనం, మౌలిక సదుపాయాలు, కార్పొరేట్ సామాజిక బాధ్యత వంటి ముఖ్యమైన రంగాలపై దృష్టి సారించినట్లు చెప్పారు. ఆయా అంశాల్లో చేపట్టిన పనుల కారణంగా పోర్టు స్థిరమైన వృద్ధిని సాధిస్తోందన్నారు. పనితీరును మెరుగుపర్చుకోవడం, సమాజంపై సానుకూల ప్రభావం ఏర్పరచడం వంటి లక్ష్యాలను నిర్దేశించుకున్నట్లు వెల్లడించారు. రూ. 46కోట్ల విలువ చేసే ప్రాజెక్టులు పూర్తయ్యాయని, సుమారు రూ. 56కోట్ల విలువ చేసే పనులు పురోగతిలో ఉన్నాయని పోర్టు కార్యదర్శి వేణుగోపాల్ వివరించారు.

సంప్రదాయబద్ధంగా కృష్ణమయ్య జయంతి



కృష్ణమయ్య విగ్రహం వద్ద పూజలు చేస్తున్న అర్చకులు

సింహాచలం, న్యూస్‌టుడే: తొలి తెలుగు వచన సంకీర్తనాచార్యుడిగా ప్రసిద్ధి పొందిన శ్రీకాంత కృష్ణమాచార్యులు(కృష్ణమయ్య) జయంతి మంగళవారం అప్పన్న దేవాలయంలో సంప్రదాయబద్ధంగా జరిగింది. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు నేతృత్వంలో అర్చకులు ఆలయ బేడామండపంలోని కృష్ణమయ్య విగ్రహం వద్ద ధూపదీప సేవలు జరిపారు. కృష్ణమయ్య అప్పన్న స్వామిపై గానం చేసిన వచనాలను ఆలపించారు. వీటికి అనుగుణంగా ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఏఈవో ఎన్.ఆనంద్‌కుమార్, పర్యవేక్షకుడు పాలూరి నరసింగరావు పాల్గొన్నారు.



ఆలయం ముందు అలరించిన నృత్య ప్రదర్శన

వైద్య ఆరోగ్య శాఖ ఆర్డీగా రాధారాణి

సీతంపేట, న్యూస్‌టుడే : విశాఖపట్నం వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ సంచాలకులు (ఆర్.డి)గా డాక్టర్ పి.రాధారాణి నియమితులయ్యారు. ఆమెను పదోన్నతిపై ఇక్కడ నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న బి.రామగిడ్డయ్యను కడపలోని ఆర్.డి.ఎం.అండ్ ఎం.ఎస్‌కు బదిలీ చేశారు.

నేటి నుంచి గోల్ఫ్ పోటీలు



ట్రోఫీని ఆవిష్కరిస్తున్న గోల్ఫ్‌క్లబ్ కార్యదర్శి ఎంఎస్ఎన్.రాజు తదితరులు

విశాఖక్రీడలు, న్యూస్‌టుడే: 'వైజాగ్ ఓపెన్-2024' గోల్ఫ్ టోర్నమెంట్ ముడసర్లోవ వద్ద గల గోల్ఫ్‌క్లబ్‌లో బుధవారం నుంచి నిర్వహించనున్నట్లు క్లబ్ కార్యదర్శి ఎంఎస్ఎన్.రాజు తెలిపారు. మంగళవారం క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ టోర్నమెంట్‌లో 15 దేశాల నుంచి క్రీడాకారులు పాల్గొంటారన్నారు. ప్రైజ్‌మనీ కోటి రూపాయలుగా నిర్ణయించామన్నారు. ఈ సందర్భంగా టోర్నమెంట్‌కు సంబంధించిన ట్రోఫీని, టీషర్టును ఆవిష్కరించారు. కార్యక్రమంలో గోల్ఫ్ క్రీడాకారులు భువనేశ్వర్, శౌర్య బిను, వికాశ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్య పరిష్కారానికి కృషి

సింధియా, న్యూస్‌టుడే: తూర్పు నౌకాదళానికి చెందిన నేవల్ డాక్‌యార్డు సమీప సర్దార్ వల్లభాయ్ పటేల్ వంతెన మరమ్మతు పనులను మంగళవారం పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు పరిశీలించారు. మరమ్మతు పనుల నేపథ్యంలో వంతెన మూసివేసిన కారణంగా షిప్‌బిల్డింగ్ సెంటర్ (ఎస్‌బీసీ) వంతెన మీదుగా రాకపోకలకు అనుమతించాలని రక్షణ ఉద్యోగులు, వారి కుటుంబీకులు సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఆందోళన చేశారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే క్షేత్రస్థాయి పనులపై ఆరా తీశారు. ఇక్కడి సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట టీఎన్‌టీయూసీ, నేతలు నాయకులు ఉన్నారు.


డాక్‌యార్డు వంతెన పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

త్రివిధ దళాల వైద్యసేవల డైరెక్టర్‌గా ఆర్తిసరీన్



సింధియా, న్యూస్‌టుడే: భారత నౌకాదళానికి చెందిన సర్జన్ వైస్ అడ్మిరల్ ఆర్తిసరీన్ దేశ రక్షణ శాఖకు చెందిన ఆర్మ్‌డ్ ఫోర్స్ మెడికల్ సర్వీసెస్‌కు (త్రివిధ దళాల వైద్యసేవలు) తొలి మహిళా డైరెక్టర్ జనరల్‌గా నియమితులైనట్లు నేవీవర్గాలు మంగళవారం తెలిపాయి. ఎయిర్‌ఫోర్స్, ఆర్మీ, కోస్టుగార్డుకు సంబంధించిన ఇది ఎంతో ప్రతిష్ఠాత్మకమైన నియామకమని పేర్కొన్నాయి. 1985 డిసెంబరులో రక్షణ వైద్య సర్వీసులో చేరిన ఆమె.. నేవీ, ఎయిర్‌ఫోర్స్ మెడికల్ డీజీగా సేవలు అందించినట్లు స్పష్టం చేశాయి.


డీఆర్డీఓ డైరెక్టర్ జనరల్‌గా హరప్రసాద్



సింధియా, కరస, న్యూస్‌టుడే: రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డీఆర్డీఓ) నూతన డైరెక్టర్ జనరల్‌గా, శాస్త్రవేత్త ఆర్వీ హరప్రసాద్ నియమితులయ్యారు. ఆయన నేవల్ సిస్టమ్స్ అండ్ మెటీరియల్స్(జోధ్‌పూర్ డీఆర్డీఓ) విభాగంలో, హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ రీసెర్చ్ లేబరేటరీ(డీఎల్ఆర్ఎల్)లో, థింక్ గ్రూపు ఆఫ్ డీఆర్డీఓలోనూ విధులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు ఉన్నతాధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

యువ రుధిరం.. నవ జీవనం..!

న్యూస్‌టుడే, గాజువాక



- రక్తదానంపై అవగాహన కల్పిస్తున్న యువకులు
- 'వందే భారత్ బ్లడ్ బ్యాంకు' ఆధ్వర్యంలో నేడు వెయ్యో శిబిరం

ప్రమాదాల బారిన పడి, సకాలంలో రక్తం అందక ఎందరో మృతి చెందిన ఘటనలు ఆయనను కలచి వేశాయి. దాంతో రక్తదానంపై ప్రజల్లో అవగాహన కల్పించడమే లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. ప్రాథమిక స్థాయిలో ఉన్నవారికి రక్తం అందిస్తూ ముందుకు సాగుతున్నారు. పదేళ్ల నుంచి ఇప్పటికి 999 రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి, వెయ్యో శిబిరం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారీ గాజువాకకు చెందిన వినోద్‌బాబు.



2014లో 60 మంది సభ్యులతో ఫ్రెండ్స్ బ్లడ్ డోనర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసి రక్తదాన శిబిరానికి శ్రీకారం చుట్టారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎక్కడికక్కడ శిబిరాలు ఏర్పాటు చేసిన పలువురి ప్రశంసలు అందుకున్నారు. తర్వాత రోటరీ క్లబ్‌లో చేరి సేవలు అందించారు. అనంతరం 'వందే భారత్ బ్లడ్ బ్యాంకు' పేరుతో మరో సంస్థను ఏర్పాటు చేసి.. రెండేళ్లుగా శిబిరాలు, అవగాహన కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు.


గాజువాకలో యువత ప్రచారం

ఆలోచన వచ్చిందిలా..

డిగ్రీ పూర్తి చేసిన వినోద్‌బాబు... ఇంటర్ చదువుతున్న సమయంలో ఆయన తండ్రి అనారోగ్యం బారిన పడ్డారు. సకాలంలో రక్తం అందిస్తే, ప్రాణాలు దక్కుతాయని వైద్యులు సూచించడంతో... ఎన్నో ప్రయత్నాలు చేశారు. అవసరమైన గ్రూపు దొరక్క వినోద్‌బాబు తండ్రి ప్రాణాలు కోల్పోయారు. తన తండ్రిలా మరొకరు చనిపోకూడదనే లక్ష్యంతో ఆయన రక్తదాన శిబిరాల నిర్వహణకు శ్రీకారం చుట్టారు.



నేటి సన్నాహాలు ఇలా..

అక్టోబరు 1న జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం, 2న గాంధీ జయంతి సందర్భంగా అనకాపల్లి జిల్లా వద్దాడి జెడ్పీ హైస్కూలు మైదానంలో బుధవారం 1000 మందితో వెయ్యో శిబిరం ఏర్పాటు చేసి, వండర్ బుక్ ఆఫ్ రికార్డుల్లో చోటు దక్కించుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు వినోద్‌బాబు తెలిపారు.


రక్తదాతలను అభినందిస్తూ..

'గివ్ బ్లడ్.. సేవ్ లైఫ్' నినాదంతో ఇప్పటి వరకు ఏర్పాటు చేసిన శిబిరాల ద్వారా 54,374 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. 30 శాతం రక్తాన్ని ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు అందించి, మిగిలిన రక్తాన్ని అత్యవసరమైన వారికి అందించారు. రక్తం కావాలని ఎవరైనా వందేభారత్ బ్లడ్ బ్యాంకుకు వెళ్తే.. దోనర్లను సమకూర్చడం గాని, అవసరమైన రక్తం నిల్వ ఉంటే అందించడం గాని చేస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు.

దక్కిన అవార్డులు.. వినోద్‌బాబు సేవలకు గుర్తింపుగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి యూత్ సర్వీసు అవార్డు, శివాజీ యూత్ ఫౌండేషన్ నుంచి ఛత్రపతి శివాజీ అవార్డు, జేసీఐ వాల్తేర్ క్లబ్ నుంచి యంగ్ డైనమిక్ పర్సన్ అవార్డు, మహాత్మా మదర్ థెరిస్సా సంస్థ నుంచి ఆపద్బాంధవుడు అవార్డు అందుకున్నారు.

న్యాయ చట్టాలపై అవగాహన

గాజువాక, న్యూస్‌టుడే: మహిళలు న్యాయ చట్టాలపై సంపూర్ణ అవగాహన పెంచుకోవాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ, సివిల్ జడ్జి ఎం. వెంకటశేషమ్మ సూచించారు. మంగళవారం 'విరాన్' సేవా సమాచార్ పేరుతో గాజువాక జోనల్ కార్యాలయంలో మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వెంకటశేషమ్మ మాట్లాడుతూ.. లైంగిక వేధింపుల నివారణకు అమల్లోకి తీసుకొచ్చిన చట్టాల్లోని అంశాలను తెలుసుకోవడంతో ఇలాంటి సదస్సులు ఉపకరిస్తాయన్నారు. ఉమెన్ చైల్డ్ వెల్ఫేర్ పీడీ జయదేవి, మహిళా పోలీసు స్టేషన్ ఏసీపీ సీహెచ్ వెంకటరావు, సీఐ మల్లేశ్వరి, ఐసీడీఎస్ పెందుర్తి సెక్టార్ అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న సివిల్‌జడ్జి వెంకట శేషమ్మ

స్పా, మసాజ్ కేంద్రాల్లో విస్తృత తనిఖీలు

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ ఆదేశాలతో నగర పరిధిలోని స్పా, మసాజ్ కేంద్రాలపై సోమవారం రాత్రి పోలీసులు విస్తృత తనిఖీలు జరిపారు. మొత్తం 83 స్పా, మసాజ్ కేంద్రాల్లో 31 తెరిచి ఉండగా, మిగిలిన 52 కేంద్రాలను మూసి ఉంచినట్లు గుర్తించారు. సుమారు 200 మంది సిబ్బందితో విస్తృత తనిఖీలు చేశారు. 2 స్పా కేంద్రాలకు లేబర్ సర్టిఫికెట్లు లేవని, 25 కేంద్రాలకు అగ్నిమాపకశాఖ కార్యాలయం నుంచి ఎన్ఓసీ లేదన్న విషయం గుర్తించారు. 18 కేంద్రాలకు జీఎస్టీ లేదని, ఒక కేంద్రంలో సి.సి. కెమెరాలు లేనట్లుగా గుర్తించి, కేసులు నమోదు చేశారు.


రికార్డులు పరిశీలిస్తున్న పోలీసు సిబ్బంది

డీఆర్‌డీఏ పీడీపై సీఈవోకు ఫిర్యాదు

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) పీడీ శోభారాణిపై పలువురు ఉద్యోగులు సెర్ప్ సి.ఈ.ఓ.కు ఫిర్యాదు చేశారు. డీఆర్‌డీఏ సిబ్బంది బదిలీలకు సంబంధించి పెద్దఎత్తున అవినీతికి పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. బదిలీల నిబంధనలు పరిగణనలోకి తీసుకోకుండా పీడీ తమ ఇష్టానుసారంగా వ్యవహరించి ఆమెకు అనుకూలంగా ఉండే వారికి నచ్చినట్లు బదిలీలు చేశారని ఆరోపించారు. డీఆర్‌డీఏ జిల్లా కార్యాలయంలో ఒక అధికారి ఆరేళ్లుగా పనిచేస్తున్నా.. నిబంధనల ప్రకారం ఆయనను పాడేరు బదిలీ చేయాల్సి ఉన్నా.. జిల్లా కార్యాలయంలోనే ఉంచారని ఆరోపించారు. పలు ప్రాంతాల్లో అర్హత లేని వారిని సైతం నియమించడం జరిగిందన్నారు. బదిలీల్లో పెద్దఎత్తున అవినీతికి పాల్పడిన పీడీపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఉద్యోగులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు, సెర్ప్ సి.ఈ.ఓ.కు, విశాఖ, అనకాపల్లి జిల్లాల కలెక్టర్లకు ఫిర్యాదు చేశారు.

'లులు సంస్థ సగం పెట్టుబడి కూడా పెట్టకపోతే ఉపయోగం ఏమిటి?'

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: లులు కంపెనీ గతంలో రూ.13 వందల కోట్ల స్థలాన్ని ప్రభుత్వం నుంచి తీసుకొని కేవలం రూ.600 కోట్ల పెట్టుబడి పెడతామని చెప్పిందని.. కనీసం తీసుకున్న స్థలం విలువలో సగం పెట్టుబడి కూడా పెట్టకపోతే ప్రయోజనం ఏముంటదని ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ అన్నారు. లాసన్స్‌బేకాలనీ వైకాపా కార్యాలయంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అందుకే గత ప్రభుత్వం ఈ సంస్థను వద్దని చెప్పిందన్నారు. నాలుగు వేల మంది స్టీల్‌ప్లాంట్ కార్మికులను తొలగించడానికి చేస్తున్న ప్రయత్నాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. వైకాపా ప్రభుత్వంలో ధరల స్థిరీకరణకు రూ.2 వేల కోట్లను కేటాయించి ధరలను అదుపులో ఉంచేదన్నారు. దీనిపై 'మీ ప్రభుత్వ హయాంలో నిత్యావసరాల ధరలు అధికంగానే ఉన్నాయి కదా..' అని ఓ విలేకరి ఎదురు ప్రశ్నించగా.. బొత్స సత్యనారాయణ అతనిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. సమావేశంలో మాజీమంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, వైకాపా నాయకులు పాల్గొన్నారు.

నగరాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

ఎండాడ, న్యూస్‌టుడే: నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (నరెడ్కో) ఆధ్వర్యంలో 'నరెడ్కో మీట్ అండ్ గ్రీట్' కార్యక్రమం ఎండాడ స్కైలైన్ అపార్ట్‌మెంట్‌లో మంగళవారం నిర్వహించారు. అతిథులుగా విచ్చేసిన తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ శ్రీభరత్ తదితరులు మాట్లాడుతూ మౌలిక రంగం విస్తరణకు ప్రభుత్వంతో పాటు ప్రైవేటు సంస్థలు కూడా ముందడుగు వేస్తే సత్ఫలితాలు వస్తాయన్నారు. రియల్ ఎస్టేట్ బాగుంటే రాష్ట్రం బాగుంటుందని, నిర్మాణ రంగం అభివృద్ధికి కూటమి సర్కారు కట్టుబడి ఉందన్నారు. విశాఖ నగరాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఇందుకోసం ప్రణాళికలు సిద్ధమవుతున్నట్లు పేర్కొన్నారు. ప్రతి కుటుంబానికి ఇంటి స్థలం, నివాస గృహం సరసమైన ధరలలో అందించాలన్నదే నరెడ్కో ఉద్దేశమని ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు గద్దె చక్రధర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రామకృష్ణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, గౌతు శిరీష, సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ శ్రీభరత్, చిత్రంలో పల్లా శ్రీనివాసరావు తదితరులు

సింహగిరిపై కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం మధ్యాహ్నం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం సంప్రదాయబద్ధంగా జరిగింది. మధ్యాహ్నం 2గంటలకు భక్తులకు స్వామివారి దర్శనాలు నిలుపుదల చేశారు. అర్చకులు, సిబ్బంది స్వామివారి అంతరాలయంతో పాటు భోగమండపం, బేడామండపం, ఆస్థాన మండపం, కల్యాణ మండపంతో పాటు ఆలయ ప్రాంగణంలోని ఉపాలయాలను నీటితో శుద్ధి చేశారు. పూజా సామగ్రి, ఇతర పాత్రలను శుభ్రపర్చారు. శుద్ధి ప్రక్రియ పూర్తయిన తర్వాత సాయంత్రం 5గంటల నుంచి యథావిధిగా భక్తులకు స్వామివారి దర్శనాలు కల్పించారు.


ఆలయంలో రాతి స్తంభాలను శుభ్రం చేస్తున్న అర్చకుడు

రెల్లి కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలి

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఏపీ రెల్లి కార్పొరేషన్‌కు నిధులు కేటాయించి రెల్లి సామాజిక వర్గ అభ్యున్నతికి చర్యలు తీసుకోవాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ కోరారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు ఆయన లేఖ రాశారు. గత ప్రభుత్వం రెల్లి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసినప్పటికీ తగిన నిధులు కేటాయించకపోవడంతో గత ఐదేళ్లలో రెల్లియువతకు ఎటువంటి సహాయం అందలేదన్నారు. దీంతో రెల్లి సామాజిక వర్గం తీవ్ర అసంతృప్తికి లోనైందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం స్పందించి రెల్లి కార్పొరేషన్‌కు తగిన నిధులు కేటాయించి ఆ సామాజికవర్గ సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

వీఎంఆర్‌డీఏ అధికారులపై చర్యలకు ఆదేశం

కార్పొరేషన్, పెదవాల్తేరు న్యూస్‌టుడే: వీఎంఆర్‌డీఏ అధికారులపై చర్యలు తీసుకోవడంతోపాటు, విచారణ చేపట్టాలని మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధిశాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. విజయనగరం ప్రకాశం వీధి నుంచి పెట్రోల్ బంకు వరకు ఆర్‌సీసీ స్లాబులు, కల్వర్టుల నిర్మాణంలో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అప్పటి ప్రధాన ఇంజినీరు (ఎఫ్ఏసీ), ప్రస్తుతం ఉద్యోగ విరమణ చేసిన ఎం.అప్పన్నపై చర్యలు తీసుకుంటూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆయనపై టిడ్కో ప్రధాన ఇంజినీరు ఎం.వెంకటేశ్వరరావు, పబ్లిక్ హెల్త్ పర్యవేక్షక ఇంజినీరు కె.రాజారావు విచారణ జరపగా, అక్రమాలకు పాల్పడినట్లు తేలడంతో అప్పన్న పింఛను నిధుల నుంచి 2.50శాతం చొప్పున రెండేళ్లపాటు రికవరీ చేయాలని ఉత్తర్వులిచ్చారు. * వీఎంఆర్‌డీఏ ప్లానింగ్ అధికారి కర్రి శివశంకర్‌పై పలు ఆరోపణలు రావడంతో వీఎంఆర్‌డీఏ ప్లానింగ్ అధికారి కె.గోపీనాథ్ విచారణ జరిపి మూడు నెలల్లో నివేదిక సమర్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. శివశంకర్ అక్రమాలపై విశాఖ అనిశా సీఐ వై.కిషోర్‌కుమార్ తయారు చేసిన నివేదికను విచారణాధికారి గోపీనాథ్‌కు ఇవ్వాలని ఆదేశాలు వెలువడ్డాయి.

హార్బర్ ఏసీపీపై సస్పెన్షన్ వేటు

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : హార్బర్ ఏసీపీగా పనిచేసి కేంద్ర కార్యాలయానికి బదిలీ అయిన మోజెస్ పాల్‌పై పలు అవినీతి ఆరోపణలు రావటంతో డి.జి.పి. ఆయనపై సస్పెన్షన్ వేటు వేశారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఒకటో పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో ఒక వ్యక్తిపై నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు విషయంలో బాధితుడిని తప్పించేందుకు కొంత మొత్తాన్ని తీసుకున్నట్లుగా నగర పోలీసు కమిషనర్‌కు ఆయనపై ఫిర్యాదు అందింది. లంచం తీసుకున్నా తనకు న్యాయం చేయలేదని, ఇప్పటికైనా తనకు న్యాయం చేయాలని సీపీని కోరటంతో ఆయన సమగ్ర విచారణ చేపట్టారు. ఆయన నివేదికకు అనుగుణంగా మోజెస్‌పాల్‌పై సస్పెన్షన్ వేటు వేస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీచేశారు. అయితే ఆ ఉత్తర్వులను కూడా ఏసీపీ తీసుకోనట్లుగా తెలుస్తోంది. ఏసీపీల బదిలీల్లో భాగంగా ఆయనకు నెల రోజుల క్రితం క్రితమే కేంద్ర కార్యాలయానికి సరెండర్ చేశారు. ఆయన స్థానంలో ఇంకా ఎవరిని నియమించకపోవటంతో ఇంకా విశాఖలోనే విధులు కొనసాగిస్తున్నారు. గతంలో ఆయన వైకాపా నాయకులకు అంటకాగినట్లుగా ఆరోపణలు ఉన్నాయి. దీంతో పాటు పలువురు రౌడీ షీటర్లకు అనుకూలంగా వ్యవహరించారనే విమర్శలు సైతం ఉన్నాయి. మోజెస్‌పాల్ సామాజికవర్గానికి చెందిన పలువురు అధికారులు ఆయనను ఈ కేసు నుంచి బయట పడేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

ఏయూలో పలువురు డీన్‌ల నియామకం

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : ఆంధ్రవిశ్వవిద్యాలయంలో పలువురు డీన్‌ల నియామకం జరిగింది. ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు ఆదేశాలతో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు నియామక ఉత్తర్వులను అందజేశారు. ఏయూ గెస్ట్ హౌస్‌లకు ఇన్‌ఛార్జి డీన్‌గా లైబ్రరీ సైన్స్ ఆచార్యులు డాక్టర్ వి.ధనరాజ్, ఏయూ సీడీసీ అసోసియేట్ డీన్‌గా ఆచార్య ఎ.రామనాగ హనుమాన్, డాక్టర్ చల్ల నరసింహం నార్త్ క్యాంపస్ ప్లేస్‌మెంట్ అధికారిగా, ఆచార్య పి.వెంకటేశ్వరరావు కాన్ఫిడెన్షియల్ విభాగం అసోసియేట్ డీన్‌గా, డాక్టర్ వి.సిద్ధయ్య, సీహెచ్ శ్రీనివాసరావు సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ (సీడీఓఈ) అసోసియేట్ డైరెక్టర్‌లుగా నియమిస్తూ ఉత్తర్వులను అందజేశారు. నూతనంగా డీన్‌లుగా నియమితులైన వారికి వీసీ, రిజిస్ట్రార్ అభినందనలు తెలిపారు.

ఏయూ అంతర కళాశాలల బ్యాడ్మింటన్ విజేత ఎలమంచిలి



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఆచార్య విజయమోహన్ తదితరులు

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: ఏయూ అంతర కళాశాలల బ్యాడ్మింటన్ పోటీలు ఎంవీపీ కాలనీలోని స్పోర్ట్స్ ఎరీనాలో మంగళవారం ముగిశాయి. పురుషుల విభాగంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల (ఎలమంచిలి) జట్టు ప్రథమ, అనిల్ నీరుకొండ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ జట్టు ద్వితీయ, ఏయూ ఇంజినీరింగ్ కళాశాల జట్టు తృతీయ స్థానాల్లో విజయం సాధించాయి. మహిళల విభాగంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల (ఎలమంచిలి) జట్టు ప్రథమ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల (శృంగవరపుకోట) ద్వితీయ, ఏయూ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ లా కళాశాల జట్టు తృతీయ స్థానాల్లో నిలిచాయి. విజేత జట్లకు ఏయూ వ్యాయామ విభాగాధిపతి ఆచార్య ఎన్.విజయమోహన్ పతకాలు, ట్రోఫీలను అందజేశారు.

75 దుకాణాలు సీజ్

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: వి.ఎం.ఆర్.డి.ఎ. ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దుకాణాలకు కొంతకాలంగా అద్దెలు చెల్లించని 75 దుకాణాలకు అధికారులు తాళాలు వేశారు. మరికొన్ని దుకాణాల నుంచి రూ. 73 లక్షలు అద్దెలు వసూలు చేశారు. దుకాణదారులు నెలవారీ అద్దెలు కచ్చితంగా చెల్లించాలని సంస్థ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ ఆదేశించారు. మంగళవారం కమిషనర్ వివిధ ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.



తాళాలు వేసిన దుకాణాలు

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	107	98
లైవ్	129	118
డ్రెస్డ్	187	206
స్కిన్‌లెస్	213	216

పెందుర్తి

తెరపై ఈనాడు
పెందుర్తిలో..
లక్ష్మీకాంత్
స్క్రీన్-1 - దేవర
స్క్రీన్-2 - సత్యం సుందరం

ఎన్టీపీసీలో నిర్వాసితులకు ఉపాధి కల్పించాలి

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ సింహాద్రి ఎన్టీపీసీలోని భూనిర్వాసితులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని టీఎన్‌టీయూసీ నేత, తెదేపా మండల ప్రధాన కార్యదర్శి ఇందల కొండలరావు డిమాండ్ చేశారు. పరవాడలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్లాంటుకు భూములిచ్చిన స్థానిక నిర్వాసితులకు ఉపాధి కల్పించకపోవడం అన్యాయమన్నారు. నిర్వాసితులకు ఉద్యోగాలు ఇచ్చేలా యాజమాన్యం చర్యలు చేపట్టాలన్నారు. లేదంటే ప్లాంటు ఎదుట ఆందోళనలు చేపడతామని వెల్లడించారు.

న్యూస్‌టుడే, పెందుర్తి

సమస్య: 97వ వార్డు చినముషిడివాడ క్రాంతి నగర్ వద్ద 75/12 స్తంభానికున్న విద్యుద్దీపం వెలగడం లేదు.
– వెంకటరమణమ్మ, క్రాంతినగర్

మేమున్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM
పెందుర్తి : 90598 98721 వేపగుంట: 93472 79909

సమాధానం: మరమ్మతు చేయించి వెలిగేలా చర్యలు తీసుకుంటాం. – శివరాం ప్రసాద్, ఏఈ, 97వ వార్డు

ఉచిత గ్యాస్‌తో.. వంటింట్లో వెలుగులు



దీపావళి నుంచి మూడు సిలిండర్లు

వేపగుంట, న్యూస్‌టుడే

నిత్యావసరాలు, ఇంటి అద్దెలతో వంటింటి భారం పెరిగిపోయింది. దీంతో బడుగుబలహీనవర్గ కుటుంబాల మనుగడ కష్టతరంగా మారింది. కూలినాలి చేసుకుని కుటుంబాన్ని పోషించేందుకు నానా కష్టాలు పడుతున్నారు. ఈ తరుణంలో 'దీపావళి' పండుగ నుంచి కూటమి ప్రభుత్వం ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలు చేయనుండటంతో ప్రతి ఇంటా ఆనందాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటి నుంచే వారి కళ్లల్లో వెలుగులు విరజిమ్ముతున్నాయి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగో లేకున్నా కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా అమలు చేసుకుంటూ ముందుకెళ్తోంది. దీంతో మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి ఇంటికి రూ.2433 ఆదా..

పెందుర్తి నియోజకవర్గం పరిధిలో సుమారు 50 వేలకు పైగా గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిని అన్ని కంపెనీల నుంచి ప్రజలు వినియోగించుకుంటున్నారు. ఇందులో పేద, మధ్య, అగ్ర వర్ణాలు ఉన్నాయి. ఉచిత గ్యాస్ సిలిండర్ పథకంతో అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రస్తుత ధరలు బట్టి ఏడాదికి సుమారు రూ.2433 ప్రయోజనం కలగనుంది.

ఆర్థిక భారం తగ్గనుంది



నా భర్త కూలి చేస్తూ కుటుంబాన్ని నడుపుతున్నారు. అద్దె ఇంటిలో ఉంటున్నాం. ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. దీంతో పిల్లల ఫీజులు, అద్దెలు ప్రతీ నెలా కష్టతరంగా మారింది. మూడు సిలిండర్లు ఉచితంగా ఇవ్వనుండటంతో ఆర్థిక భారం తగ్గనుంది.
– మాదిరెడ్డి లక్ష్మి, జేఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీ, అప్పన్నపాలెం

ఆ డబ్బులతో ఇంటి అద్దె చెల్లించుకుంటా..



ప్రయివేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నా. జీతం చాలా తక్కువ. ఆర్థిక ఇబ్బందులు, దేవస్థానం భూసమస్య కారణంగా ఇళ్లు నిర్మించుకోలేకపోయాం. పక్కనే అద్దెకు ఉంటున్నాం. ఇలాంటి సమయంలో ఉచిత గ్యాస్ సిలిండర్‌తో ఏడాదికి మిగిలే డబ్బులతో ఇంటి అద్దె చెల్లించుకుంటాను.
– పి.ఆశ, ప్రయివేటు పాఠశాల ఉపాధ్యాయురాలు

పింఛనుతో జీవిస్తున్న మాకు ఎంతో ఉపయోగకరం



నేను ప్రభుత్వమిస్తున్న రూ.4 వేలు వితంతు పింఛనుతో జీవిస్తున్నాను. ఇలాంటి సమయంలో ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం రావడం తనలాంటి వారికి ఎంతో ప్రయోజనకరం. ఆ మొత్తాన్ని వేరే ఖర్చులకు ఉపయోగపడతాయి.
– మంత్రి మాధవి, ప్రహ్లాదపురం

ఆరోగ్యకర సాగు విధానాన్ని ప్రోత్సహించాలి



పంట నమోదు వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ విజయకృష్ణన్

సబ్బవరం, న్యూస్‌టుడే: నాణ్యమైన, ఆరోగ్యకర పంటలు పండించేలా రైతులను ప్రోత్సహించాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. మంగళవారం సబ్బవరం మండలం తవ్వవానిపాలెం ఈ-పంట నమోదు కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. గ్రామంలోని నిర్దేశిత నంబరులోని వరి పంటను పరిశీలించారు. రైతు దెక్క సన్నిబాబుతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నమోదు చేసిన పంట రైతుభూమి ఒకటేనని నిర్ధారించుకున్నారు. అదేవిధంగా రైతు సేవా కేంద్రాల ద్వారా అందిస్తున్న ఎరువులు సక్రమంగా అందుతున్నదీ లేనిదీ పరిశీలించారు. అనంతరం మండలంలోని సబ్బవరం శివారు చిన్నయ్యపాలెంలో కూరగాయలు పండించే రైతుతో మాట్లాడారు. వారి సమస్యలు వెంటనే పరిష్కరించాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు, అనకాపల్లి వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.రామారావు, సబ్బవరం మండల వ్యవసాయాధికారి పోతల సత్యనారాయణ, ఏఈవో బాలరాజు, వీఏఏ లావణ్య, తవ్వవానిపాలెం సర్పంచి బోకం సోమునాయుడు, ఆర్ఐ వీరయ్య, వీఆర్వోలు, టెక్నికల్ ఏవో విరల్‌కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవి ఉత్సవాల గోడపత్రిక ఆవిష్కరణ



గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న ఉత్సవకమిటీ ప్రతినిధులు

పరవాడ, న్యూస్‌టుడే: మేజరుపంచాయతీ పరవాడలోని బొంకుల దిబ్బయాత్ ఆధ్వర్యంలో ఈనెల 3 నుంచి 12 వరకు దుర్గాదేవి ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన గోడపత్రికలను మంగళవారం ఎంపీటీసీ సభ్యులు పైలా శ్రీనివాసరావు, మాజీ సర్పంచి చుక్క రామునాయుడు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు కలిసి ఆవిష్కరించారు. 3న అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, వేంకటేశ్వరస్వామి పాట, 4న బుర్రకథ, 5న లక్ష దీపారాధన, 6న ఆటల పోటీలు, 7న ఉట్టికొట్టుట, 8న ముగ్గుల పోటీలు, 9న సరస్వతిదేవిపూజ, 10న భారీ అన్నసమారాధన, 11న అమ్మవారి సారె ఊరేగింపు, 12న అనుపోత్సవం ఉంటుందన్నారు.

దసరా సెలవులు.. వాహనాల రద్దీ

పెందుర్తి, న్యూస్‌టుడే: దసరా సెలవుల నేపథ్యంలో విశాఖ - అరకు రహదారిలో వాహనాల రద్దీ బాగా పెరిగింది. బుధవారం నుంచి పాఠశాలలకు సెలవులు కావడంతో సొంతూర్లకు, అరకు పర్యాటకానికి వెళ్లే వారి సంఖ్య అధికంగా ఉంది. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం నుంచి పెందుర్తి బీఆర్టీఎస్ రహదారిలో వాహనాల రద్దీ నెలకొంది. పెందుర్తి కూడలిలో పలు మార్లు ట్రాఫిక్ నిలిచిపోయింది. సెలవులు ముగిసే వరకు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశముందని స్థానికులు చెబుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు రద్దీ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు.



పెందుర్తి కూడలిలో బారులుతీరిన వాహనాలు

ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన

రాంపురం (పెందుర్తి), న్యూస్‌టుడే: రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని అలవాటు చేసుకోవాలని పెందుర్తి మండల వ్యవసాయాధికారి టి.దుర్గాప్రసాద్ సూచించారు. రాంపురం గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రైతులకు ఆయన పలు సూచనలు చేశారు. రబీలో అవసరమైన విత్తనాలపై చర్చించారు. ప్రకృతి వ్యవసాయ విధానాలను వివరించి అవగాహన కల్పించారు. రైతులు మాట్లాడుతూ ఆయిల్ ఇంజిన్లు, టార్పాలిన్లు, స్ప్రేయర్లు కావాలని కోరారు. ఆకు ముడత, సుడిదోమ తెగుళ్ల నివారణ చర్యలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ ఫ్లోర్‌లీడర్ రెడ్డి నారాయణరావు, రైతులు పాల్గొన్నారు.

7న సబ్బవరం మండల సర్వసభ్య సమావేశం

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండల సర్వసభ్య సమావేశం ఈనెల 7న ఉదయం 10.30 గంటలకు మండల పరిషత్ సమావేశ మందిరంలో జరుగుతుందని ఎంపీడీవో పి.పద్మజ తెలిపారు. సంబంధిత నేతలు, అధికారులు హాజరుకావాలని కోరారు.

పాఠశాలకు సామగ్రి వితరణ

రాంపురం (పెందుర్తి), న్యూస్‌టుడే: భారతీయ స్టేట్‌బ్యాంకు రాంపురం శాఖ ఆధ్వర్యంలో సుమారు రూ.5 లక్షల సీఎస్ఆర్ నిధులతో స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలకు వివిధ రకాల సామగ్రి వితరణ చేశారు. మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ శ్రీనివాసరావు, అధికారులు సామగ్రిని ప్రధానోపాధ్యాయుడు జయప్రసాద్‌కు అందజేశారు. ఇందులో భాగంగా ఆర్‌వో ప్లాంటు, డెస్క్‌టాప్‌లు, టేబుళ్లు, గోద్రెజ్ బీరువాలు, స్టాఫ్ టేబుళ్లు, విద్యార్థులకు డ్యూయల్ డెస్క్ బెంచీలు, ప్రింటర్, కంప్యూటర్ వీల్ ఛైర్లు అందజేసినట్లు అధికారులు తెలిపారు.



సమకూర్చిన సామగ్రితో స్టేట్‌బ్యాంకు అధికారులు

పెందుర్తిలో 97 శాతం పింఛన్ల పంపిణీ



గొల్లనారాయణపురంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, జడ్పీ హేమవతి

పెందుర్తి, న్యూస్‌టుడే: ప్రభుత్వం అందిస్తున్న సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం పెందుర్తి మండలంలో మంగళవారం విజయవంతంగా జరిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన కార్యక్రమంలో 97.25 శాతం లబ్ధిదారులకు పంపిణీ పూర్తి చేసినట్లు ఇన్‌ఛార్జి ఎంపీడీవో కొల్లి వెంకటరావు తెలిపారు. మండలంలోని తొమ్మిది సచివాలయాల పరిధిలో 4,097 మంది లబ్ధిదారులకు రూ.1,71,30,500 నగదు పంపిణీ చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

వేపగుంట, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం మంగళవారం 93వ వార్డు గొల్లనారాయణపురంలో జరిగింది. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 100 రోజుల పాలనలో ఎన్నికల్లో ఇచ్చిన మాటను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జడ్పీ హేమవతి, ఏపీడీ శ్రీరాం, మాజీ కార్పొరేటరు రాపర్తి శైలజ, జిల్లా మహిళా కార్యనిర్వాహక కార్యదర్శి శోభారాణి, తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం, న్యూస్‌టుడే: ఆసుపత్రిలో ఉన్న రోగులు మినహా పింఛన్ల పంపిణీ తొలి రోజునే వంద శాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ సూచించారు. సబ్బవరం మండలంలోని అమృతపురంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా పరిశీలించారు. పింఛను మొత్తం అందుతుందా లేదానని పింఛనుదారులను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు సబ్బవరం ఎంపీడీవో పి.పద్మజ, ఈవోపీఆర్‌డీ ఒ.మహేశ్ సబ్బవరం గోపాలన్‌నగర్‌లోని లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీని పరిశీలించారు. కార్యక్రమంలో తెదేపా నేతలు కె.శ్రీను, బర్ల రమణ, గ్రామ కార్యదర్శి కె.మూర్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



సబ్బవరం గోపాల్‌నగర్‌లో ఎంపీడీవో పి.పద్మజ, ఈవోపీఆర్‌డీ ఓ.మహేష్ తదితరులు



రాంపురంలో పింఛను అందిస్తున్న ఎంపీడీవో కొల్లి వెంకటరావు, అధికారులు



ముత్యాలమ్మపాలెంలో..

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలంలోని ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం మంగళవారం వేగవంతంగా సాగింది. ఉదయం 5 గంటలకే సచివాలయ సిబ్బంది ఇంటింటికి తిరిగి వృద్ధులకు, ఒంటరిమహిళలకు, కల్లుగీత కార్మికులకు, దివ్యాంగులకు తదితరులకు పింఛను సొమ్మును అందజేశారు. ముత్యాలమ్మపాలెంలో సర్పంచి, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షురాలు చింతకాయల సుజాత చేతులమీదుగా పంపిణీ చేశారు. పరవాడలో ఎంపీడీవో శ్యామ్‌సుందర్ కార్యక్రమాన్ని పరిశీలించారు. పరవాడ మండల వ్యాప్తంగా 6567 మంది పింఛనుదారులు ఉండగా తొలిరోజు 6433 మందికి పింఛన్లు అందించామని ఎంపీడీవో తెలిపారు. మిగిలిన వారికి బుధవారం ఇవ్వనున్నట్లు వెల్లడించారు.

డ్రోన్లతో దోమలపై దండయాత్ర

సుజాతనగర్ (పెందుర్తి), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం దోమల నివారణ చర్యలకు విస్తృత చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా భారీ నీటి నిల్వలున్న ప్రాంతాల్లో డ్రోన్ల సాయంతో దోమల నివారణ రసాయాలు వెదజల్లే కార్యక్రమాన్ని జీవీఎంసీ జోన్-8 పరిధిలో చేపట్టారు. మలేరియా విభాగం ఇన్‌స్పెక్టర్ బీడీనాయుడు ఆధ్వర్యంలో మంగళవారం 97, 95 వార్డుల్లో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 97వ వార్డు పరిధిలోని కార్మికనగర్ చెరువులో కార్పొరేటర్ శానాపతి వసంత శంకర్రావు డ్రోన్ పిచికారీని ప్రారంభించారు. అలాగే 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు పురుషోత్తపురం వెంకప్ప చెరువు, జ్యోతినగర్ చెరువు, లక్ష్మీపురం రాముడు చెరువుల్లో డ్రోన్‌తో ఎంఎల్ ఆయిల్ వెదజల్లే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో మలేరియా సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.



డ్రోన్ సాయంతో దోమల నివారణ చర్యలు ప్రారంభిస్తున్న 97వ వార్డు కార్పొరేటర్ శానాపతి వసంత, తదితరులు

కనకదుర్గమ్మ ఆలయంలో శరన్నవరాత్రి వేడుకలు



సుజాతనగర్‌లో కొలువైన కనకదుర్గమ్మ వారు

సుజాతనగర్ (పెందుర్తి), న్యూస్‌టుడే: జీవీఎంసీ 97వ వార్డు సుజాతనగర్‌లో కొలువైన కనకదుర్గ అమ్మవారి దేవాలయంలో ఈ నెల 3 నుంచి 12వ తేదీ వరకు దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవోపేతంగా జరుగుతాయని ఆలయ ధర్మకర్త వాకా చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. గురువారం ఉదయం 5.30 గంటలకు అమ్మవారికి అభిషేకం, గణపతి పూజ, కలశ స్థాపనతో ఉత్సవాలకు శ్రీకారం చుడతామన్నారు. 12వ తేదీ వరకు జగన్మాత రోజుకొక అవతారంలో భక్తులకు దర్శనమిస్తారని పేర్కొన్నారు. రోజూ జరిగే సహస్ర కుంకుమార్చన పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

హనుమంతుడి సన్నిధిలో భజన

పురుషోత్తపురం (పెందుర్తి), న్యూస్‌టుడే: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా పురుషోత్తపురంలో జనసేన నాయకులు భజన కార్యక్రమం చేపట్టారు. ఆ పార్టీ ప్రచార కమిటీ సభ్యుడు ఉరిటి లక్కీగోవింద్ ఆధ్వర్యంలో మంగళవారం జన సైనికులు, వీర మహిళలు ఆంజనేయ స్వామి ఆలయంలో నారాయణ నామజపం, భజనలు చేశారు. తొలుత హనుమంతుడికి విశేష పూజలు నిర్వహించారు.

ఘనంగా దసరా వేడుకలు

పెందుర్తి, న్యూస్‌టుడే: దసరా సెలవుల నేపథ్యంలో మంగళవారం పలు పాఠశాలల్లో ముందస్తు దసరా వేడుకలు ఘనంగా జరిగాయి. సుజాతనగర్ దరి ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయిని ఎన్.రమాదేవి ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు. బాలబాలికలు ఆటపాటలతో సందడి చేశారు. బాలికలు నవదుర్గల రూపంలో అలంకరించుకుని నృత్యరూపకం ప్రదర్శించారు. ★ పెందుర్తి శ్రీచైతన్య పాఠశాలలో ముందస్తు దసరా వేడుకలు వైభవంగా జరిగాయి. ప్రిన్సిపల్ తారకేశ్వరరావు ఆధ్వర్యంలో చిన్నారులు నవదుర్గలుగా అలంకరించుకుని అమ్మవారికి పూజలు చేశారు. చిన్నారులు జానపద గీతాలకు నృత్యాలు చేసి అలరించారు. పాఠశాలల రీజనల్ ఇన్‌ఛార్జి మహమ్మద్ అలీ ముఖ్య అతిథిగా పాల్గొని వేడుకలు ప్రారంభించారు.



సుజాతనగర్ ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాలలో నవదుర్గల అలంకరణలో విద్యార్థినులు



పెందుర్తి శ్రీచైతన్య పాఠశాలలో..

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న దృశ్యం

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ సింహాద్రి ఎన్టీపీసీ దీపాంజలి నగర్ జీవనరేఖ ఆసుపత్రిలో మంగళవారం జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిబిరాన్ని ప్లాంట్ వోఅండ్ఎం విభాగ జీఎం ఎస్.జె. డేవిడ్ ప్రారంభించారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని.. ఇందుకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. 35 మంది రక్తదానం చేశారు. గాజువాకకు చెందిన వందేభారత్ బ్లడ్ సెంటర్ ప్రతినిధులు రక్తాన్ని సేకరించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీపీసీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ విజయ, ఎన్టీపీసీ అధికారులు, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ తహసీల్దార్‌గా ఎస్.వి.అంబేడ్కర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన నక్కపల్లి నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా కార్యాలయ డీటీ ఆర్.ఐలు, సర్వేయర్, వీఆర్వోలు తదితర రెవెన్యూ సిబ్బంది ఆయనను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.



పరవాడ తహసీల్దార్ అంబేడ్కర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రెవెన్యూ సిబ్బంది

సింహాద్రి ఎన్టీపీసీ కార్మికుడి మృతి



పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ సింహాద్రి ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికుడు మంగళవారం ఆకస్మికంగా మృతి చెందారు. సీ.ఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పరవాడ మండలం కలపాక పంచాయతీ పరిధి మూలస్వయంభూవరం గ్రామానికి చెందిన **పడాల నాగేశ్వరరావు** (55) కొంతకాలంగా ఎన్టీపీసీలో కాంట్రాక్టు కార్మికుడిగా పని చేస్తున్నారు. ఉదయం 9 గంటలకు జనరల్ షిఫ్టు విధులకు హాజరయ్యారు. ప్లాంటులోని సీహెచ్‌పీ-1 వద్ద హౌస్ కీపింగ్ (బొగ్గు) పనులు చేస్తుండగా 11.30 గంటల సమయంలో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వెంటనే తోటి కార్మికులు ఎన్టీపీసీ దీపాంజలినగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడ నుంచి అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతదేహాన్ని ఎన్టీఆర్ ఆసుపత్రిలో భద్రపరిచారు. నాగేశ్వరరావుకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతుడు కుమారుడు లక్ష్మణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీ.ఐ తెలిపారు. ★ ఎన్టీపీసీ కార్మికుడు నాగేశ్వరరావు మృతిపై సమగ్ర విచారణ చేయించి.. మృతుడి కుటుంబానికి పరిహారం చెల్లించి న్యాయం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని తోటి కార్మికులు ప్లాంటు వద్ద నిరసన తెలిపారు.

అభినందన సభ

నరవ(వేపగుంట), న్యూస్‌టుడే: బెహరా కళాశాలలో ఇటీవల అమెజాన్ కంపెనీ జరిపిన ప్రాంగణ ఎంపికల్లో ఉపాధి పొందిన విద్యార్థులకు మంగళవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బెహరా కళాశాలల ఎండీ బెహరా విజయచైతన్య, అధ్యాపకులు కామేశ్, వంశీ, తదితరులు పాల్గొన్నారు.



ప్రాంగణ ఎంపికల్లో ఉపాధి పొందిన విద్యార్థులు



పెందుర్తి కూడలిలో కురుస్తున్న వర్షం

ఉదయం భానుడు.. మధ్యాహ్నం వరుణుడు

పెందుర్తి, న్యూస్‌టుడే: ఉదయమంతా భానుడి ప్రతాపంతో పెందుర్తి పరిసర ప్రాంత ప్రజలు మంగళవారం తీవ్ర ఉక్కపోతకు గురయ్యారు. మధ్యాహ్నం 2 గంటలు దాటాక ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమైంది. ఉరుములు, మెరుపులతో సుమారు గంట పాటు కురిసిన భారీ వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. పలు కాలనీల్లో గుంతల దారుల్లో ప్రజలు ఇబ్బంది పడ్డారు.

సత్తా చాటిన విద్యార్థులు

లంకెలపాలెం(పరవాడ), న్యూస్‌టుడే: జీవీఎంసీ 79వ వార్డు పరిధి లంకెలపాలెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు చెందిన 15 మంది విద్యార్థులు వి.జుత్తాడ పాఠశాలలో జరిగిన పెందుర్తి నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో సత్తా చాటారు. కబడ్డీ, ఖోఖో, చదరంగం, యోగా పోటీల్లో రాణించి ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో విజేతలను ప్రధానోపాధ్యాయుడు రౌతు నాగేశ్వరరావు అభినందించారు. ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులతో హెచ్ఎం నాగేశ్వరరావు, ఉపాధ్యాయ సిబ్బంది



విద్యార్థులతో ప్రిన్సిపల్ సీతాలక్ష్మి, సీఈవో నిశాంత్

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం పి.బోనంగి సంస్కృతి గ్లోబల్‌స్కూల్‌కు చెందిన విద్యార్థులు స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఈనెల 3, 4 తేదీల్లో ఏలూరు జిల్లా పెదవేగిలో జరగనున్న రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఎ.వి.శశాంక్‌వర్మ, పి.మహేశ్, బి.రోహిత్ రాజు, కె.ధీరజ్‌శ్రీరామ్ గతనెలలో విశాఖ కృష్ణాపురంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో రాణించినట్లు స్పోర్ట్స్ డైరెక్టర్ జి.మధుబాబు తెలిపారు. మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను ప్రిన్సిపల్ సీతాలక్ష్మి అభినందించారు. సీఈవో నిశాంత్, కోచ్ రాజేశ్, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా స్థాయిలో రాణింపు

సబ్బవరం, న్యూస్‌టుడే: జిల్లా స్థాయి అండర్-19 క్రీడా పోటీల్లో సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. చోడవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం క్రీడా పోటీలు నిర్వహించారు. ఫిజికల్ డైరెక్టర్ కె.రమణారావు ఆధ్వర్యంలో పాల్గొన్న విద్యార్థుల్లో ముగ్గురు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ పీవీఎన్ మూర్తి తెలిపారు. వాలీబాల్ పోటీల్లో పి.ప్రశాంతి (ఎంపీసీ ద్వితీయ సంవత్సరం), ఎ.ఆనంద్ (సీఈసీ ప్రథమ సంవత్సరం).. కబడ్డీలో డి.మాతాజీ (ఈటీ ఒకేషనల్ ద్వితీయ సంవత్సరం) ఉన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్‌తో పాటు జిల్లా వృత్తి విద్యా పర్యవేక్షక అధికారి పి.మురళీధర్ తదితరులు వారిని అభినందించారు.



పి.ప్రశాంతి



ఎ.ఆనంద్



డి.మాతాజీ

ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలి

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మంగళవారం పరవాడ పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. సీ.ఐ ఆర్.మల్లికార్జునరావు ముఖ్య అతిథిగా మాట్లాడారు. రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనలు పక్కాగా పాటించాలన్నారు. మైనర్లు వాహనాలు నడపరాదన్నారు. హెల్మెట్ ధరించాలని, మితిమీరిన వేగం పనికి రాదని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ నారాయణరావు, అధ్యాపక సిబ్బంది శ్రీధర్, లక్ష్మి, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీ.ఐ మల్లికార్జునరావు

మద్యం దుకాణాలకు తొలిరోజు 200 దరఖాస్తులు



- అడ్డొచ్చిన అమావాస్య సెంటిమెంట్
- మొత్తం లక్షకు పైగా అర్జీలు రావొచ్చని అంచనా
- నాన్ రీఫండబుల్ రుసుముల రూపేణా రూ.2 వేల కోట్ల ఆదాయం!
- ఆన్‌లైన్‌లో అర్జీల స్వీకరణకు ప్రత్యేక వెబ్‌పోర్టల్

ఈనాడు – అమరావతి

రాష్ట్రంలో కొత్తగా మద్యం దుకాణాల కోసం ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానించగా, తొలిరోజైన మంగళవారం 200కు పైగా వచ్చాయి. వీటిలో ఆఫ్‌లైన్ విధానంలో స్థానిక ఎక్సైజ్ స్టేషన్లలో నేరుగా సమర్పించినవే ఎక్కువగా ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 3,396 మద్యం దుకాణాలకు లైసెన్సుల జారీకి ఎక్సైజ్ శాఖ సోమవారం అర్ధరాత్రి తర్వాత నోటిఫికేషన్ ఇచ్చిన సంగతి తెలిసిందే. మంగళవారం అమావాస్య కావడంతో వ్యాపారులు పెద్దగా ఆసక్తి చూపలేదు. మొత్తంగా లక్షకు పైగా దరఖాస్తులు రావొచ్చని ఎక్సైజ్ అధికారులు అంచనా వేస్తున్నారు. నాన్ రిఫండబుల్ దరఖాస్తు రుసుముల రూపంలోనే దాదాపు రూ.2 వేల కోట్ల ఆదాయం సమకూరుతుందని భావిస్తున్నారు. 2017లో 4,380 మద్యం దుకాణాలకు నోటిఫికేషన్ ఇవ్వగా, ఒక్కో దానికి సగటున 18 చొప్పున మొత్తంగా 78 వేల దరఖాస్తులు అందాయి. ఈసారి 3,396 దుకాణాలకుగానూ ఒక్కో దానికి సగటున 30 వరకు దరఖాస్తులు పడతాయని అంచనా వేస్తున్నారు. ఈ నెల 9 వరకు గడువు ఉండగా, చివరి మూడు రోజుల్లో ఎక్కువ దరఖాస్తులు పడే అవకాశముంది.

ఆన్‌లైన్‌లో అయితే..

మద్యం దుకాణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణకు ఎక్సైజ్ శాఖ ప్రత్యేకంగా వెబ్ పోర్టల్ తీసుకొచ్చింది. hpfsproject.com వెబ్‌సైట్‌లోకి వెళ్లి తొలుత రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఫోన్‌నంబర్‌నే యూజర్ ఐడీగా వినియోగించుకొని, పాస్‌వర్డ్ సృష్టించుకోవాలి. తర్వాత యూజర్ నేమ్, పాస్‌వర్డ్ లేదా ఓటీపీతో లాగిన్ అయ్యి దరఖాస్తు చేసుకోవచ్చు. దీనికి సంబంధించిన సమగ్ర యూజర్ మాన్యువల్‌ను వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. దరఖాస్తు విధానానికి సంబంధించిన ఉత్తర్వులు కూడా వెబ్‌సైట్‌లో పెట్టారు.

విశాఖలో గరిష్ఠం

ఎక్సైజ్ శాఖ నోటిఫై చేసిన 3,396 దుకాణాల్లో 2,261 (66.57 శాతం) మండలాల్లోనే ఏర్పాటు చేయనుంది. నగరపాలక సంస్థల పరిధిలో 511, పురపాలక సంఘాల్లో 499, నగర పంచాయతీల్లో 125 చొప్పున నోటిఫై చేసింది. అత్యధికంగా విశాఖపట్నం కార్పొరేషన్ పరిధిలో 136, గుంటూరులో 52 చొప్పున ప్రకటించింది. జిల్లాల వారీగా చూస్తే అత్యధికంగా తిరుపతిలో 227, అత్యల్పంగా అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలో 40 దుకాణాలను నోటిఫై చేసింది.

అందుబాటులో కోరుకున్న మద్యం బ్రాండ్లు

నూతన మద్యం విధానంలో భాగంగా దుకాణాల్లో నేషనల్, మల్టీ నేషనల్ బ్రాండ్లను అందుబాటులో ఉంచనుంది. వినియోగదారులు కోరుకునే బ్రాండ్లన్నీ విక్రయిస్తారు. సరఫరా కంపెనీల నుంచి మద్యం కొనుగోలు కోసం చెల్లించే బేసిక్ ప్రైస్ (మూల ధర)ను చెల్లించేందుకు హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి ఆధ్వర్యంలో కమిటీ వేయనుంది. 90 రోజుల్లోగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం మద్యంపై 10 రకాల పన్నులు విధిస్తుండగా, తాజా విధానంలో వాటిని ఆరుకు కుదించారు. ఎక్సైజ్ డ్యూటీ, రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్, వ్యాట్, స్పెషల్ మార్జిన్, అదనపు రిటైల్ ఎక్సైజ్ సుంకం, రౌండింగ్ ఆఫ్ పన్నులు ఉంటాయి.

జిల్లాల వారీగా అన్‌రిజర్వ్‌డ్ కేటగిరీలో నోటిఫై చేసిన మద్యం దుకాణాల సంఖ్య

జిల్లా	దుకాణాలు
శ్రీకాకుళం	158
విజయనగరం	153
పార్వతీపురం మన్యం	52
అల్లూరి సీతారామరాజు	40
విశాఖపట్నం	155
అనకాపల్లి	136
కాకినాడ	155
డా.బీఆర్.అంబేడ్కర్ కోనసీమ	133
తూర్పుగోదావరి	125
పశ్చిమగోదావరి	175
ఏలూరు	144
కృష్ణా	123
ఎన్టీఆర్	113
గుంటూరు	127
బాపట్ల	117
పల్నాడు	129
ప్రకాశం	171
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు	182
కర్నూలు	99
నంద్యాల	105
అనంతపురం	136
శ్రీసత్యసాయి	87
వైఎస్సార్	139
అన్నమయ్య	111
చిత్తూరు	104
తిరుపతి	227

పట్టా, డీకేటీ భూముల్లో ఇసుక తవ్వకాలకు ఓకే

నదీగర్భంలో జిల్లా ఇసుక కమిటీ ద్వారా తవ్వకాలు

పట్టాదారుకు టన్నుకు రూ.60 చొప్పున చెల్లింపు

నదీగర్భం బయట పట్టాదారే తవ్వి, విక్రయించేందుకు అవకాశం

గరిష్ఠంగా టన్ను రూ.250కి మించి అమ్మకూడదు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో నదీగర్భంలో, నదిని ఆనుకొని ఉన్న పట్టా, డీకేటీ భూముల్లో ఇసుక తవ్వకాలకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇసుక కొరతను తీర్చేందుకు ఆయా భూముల్లో మేటవేసిన ఇసుకను తవ్వి, విక్రయించేందుకు అవకాశం కల్పించింది. నదీగర్భం లోపల ఉండే భూముల్లోని ఇసుకను జిల్లాస్థాయి ఇసుక కమిటీ ద్వారా తవ్వి విక్రయించనుండగా, నదీగర్భం బయట ఉండే భూముల్లో నేరుగా పట్టాదారే తవ్వుకునేందుకు వీలు కల్పించారు. ఈ మేరకు గనులశాఖ ముఖ్యకార్యదర్శి ముకేశ్‌కుమార్ మీనా మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. వెంటనే ఈ ఆదేశాలు అమల్లోకి వస్తాయి. పట్టా, డీకేటీ భూముల్లో ఇసుక తవ్వకాలకు మూడు రకాలుగా వీలు కల్పించారు.



పట్టాదారుకు ఇలా..

■ నదీగర్భం లోపల భూముల్లో ఇసుక మేటలు ఉంటే.. పట్టాదారు దరఖాస్తు చేసుకోవాలి. పట్టాదారు పాస్‌పుస్తకం, టైటిల్‌డీడ్ అందజేయాలి. అందులో ఇసుక తవ్వకాలకు అంగీకరిస్తున్నట్లు పేర్కొనాలి.

■ వీటిని జిల్లాస్థాయి ఇసుక కమిటీ ఆదేశాలతో తహసీల్దార్, మండల వ్యవసాయశాఖ అధికారి, భూగర్భజలశాఖ అధికారి, జలవనరులశాఖ ఈఈ, జిల్లా గనులశాఖ అధికారితో కూడిన బృందం క్షేత్రస్థాయిలో తనిఖీ చేస్తుంది.

■ తర్వాత ఆ భూముల్లో ఇసుక తవ్వకాలకు మైనింగ్ ప్లాన్, పర్యావరణ, పీసీబీ అనుమతులను కలెక్టర్ పేరుతో జిల్లా గనులశాఖ అధికారి తీసుకుంటారు. ఈ ఫీజులన్నీ ప్రభుత్వమే చెల్లిస్తుంది.

■ అనుమతులు వచ్చాక, పట్టాదారుతో జిల్లా ఇసుక కమిటీ ఒప్పందం చేసుకుంటుంది. తర్వాత ఈ కమిటీ ద్వారా ఇసుక తవ్వి, విక్రయిస్తారు. ఇలా తవ్విన ఇసుకలో టన్నుకు రూ.60 చొప్పున పట్టాదారుకు చెల్లిస్తారు.

■ ఈ ఇసుక నిల్వలను శాండ్ పోర్టల్‌లో చూపించి, ఆన్‌లైన్ బుకింగ్‌తోనే విక్రయిస్తారు.

ప్రభుత్వ పనులకే..

■ నదీగర్భం బయట ఉన్న భూముల్లో.. గతంలో వరదల వల్ల ఇసుక మేటలు వేసి, ముందు మళ్లీ వరదలతో ఇసుక వచ్చే అవకాశం లేని భూముల్లో జిల్లా ఇసుక కమిటీ ద్వారానే తవ్వకాలు జరిపిస్తారు. ఇలాంటి భూముల్లో తవ్వకాలకు అనుమతులన్నీ జిల్లా గనులశాఖ అధికారులే తీసుకుంటారు. ఈ ఇసుకను ప్రభుత్వ పనులకే వినియోగిస్తారు.

అనుమతులు తెచ్చుకోవాల్సింది పట్టాదారే

■ నదీగర్భం బయట భూముల్లో గతంలో వరదలతో ఇసుక మేటలు ఏర్పడి, మళ్లీ భవిష్యత్‌లో వరదల వల్ల ఇసుక వచ్చే అవకాశం ఉన్నచోట్ల.. పట్టాదారే ఇసుక తవ్వకాలు చేసేందుకు అనుమతిస్తారు. అయితే వీటికి 5 కి.మీ. పరిధిలో ప్రభుత్వ రీచ్‌లు గానీ, పూడిక రూపంలో ఇసుక తవ్వే పాయింట్లు గానీ ఉండకూడదు. ■ పట్టాదారు దరఖాస్తు చేసుకుంటే, ఆయా శాఖల అధికారుల బృందం పరిశీలించి, జిల్లా ఇసుక కమిటీకి నివేదిక ఇచ్చాక, అది అనుమతిస్తుంది. ■ తర్వాత పట్టాదారు సంబంధిత శాఖల నుంచి అనుమతులు తెచ్చుకోవాలి. ■ అనంతరం పట్టాదారు తన భూమిలో ఇసుక తవ్వి, గనులశాఖ పోర్టల్ ద్వారా టన్ను రూ.250కి విక్రయించాలి. ఇందులో టన్నుకు రూ.88 సీనరేజి కింద మినహాయిస్తారు.

వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరకు రెక్కలు

- విజయవాడలో ఇక రూ.1,918

ఈనాడు వాణిజ్య విభాగం: రెస్టారెంట్లలో, ఇతర వాణిజ్య అవసరాలకు వినియోగించే 19 కేజీల గ్యాస్ సిలిండర్ ధరను ఈ నెల 1 నుంచి (మంగళవారం) పెంచినట్లు చమురు మార్కెటింగ్ సంస్థలు ప్రకటించాయి. హైదరాబాద్‌లో ఈ సిలిండర్ ధర రూ.1919 నుంచి రూ.48 పెరిగి రూ.1967కు చేరింది. విజయవాడలో రూ.1,870 నుంచి రూ.48 అధికమై రూ.1,918కి చేరినట్లు అధికారులు వెల్లడించారు. ఈ సిలిండర్ ధరను ఆగస్టు, సెప్టెంబరులలో కూడా పెంచారు. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలకు అనుగుణంగా వీటి ధరలను కంపెనీలు సవరిస్తుంటాయి. ఇళ్లలో వినియోగించే 14.2 కిలోల గ్యాస్ సిలిండర్ ధరలో మార్పులేమీ చేయలేదు.

పేదలకు రాయితీపై కందిపప్పు, పంచదార

- రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం నుంచే మొదలైన పంపిణీ

రేషన్ దుకాణాల ద్వారా తెల్లకార్డుదారులకు రాయితీపై కందిపప్పు, పంచదార పంపిణీ 16 నెలల తర్వాత మళ్లీ మొదలైంది. దసరాకు ముందే రూ.67కు కిలో కందిపప్పు, రూ.17కు అరకిలో పంచదార పంపిణీ చేయాలని ఎన్డీయే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనిద్వారా 1.48 కోట్ల కుటుంబాలకు లబ్ధి కలగనుంది. వైకాపా ప్రభుత్వ హయాంలో గతేడాది జూన్ నుంచి కందిపప్పు పంపిణీ నిలిపివేయడంతో అప్పటి నుంచి కార్డుదారులు కిలో రూ.170కు బహిరంగ మార్కెట్లో కొనుగోలు చేస్తున్నారు. కొత్త ప్రభుత్వం వచ్చాక కందిపప్పు పంపిణీపై దృష్టి పెట్టింది. మూడు నెలల పాటు సరఫరా చేసేందుకు రెండుసార్లు టెండర్లు పిలిచారు. ఇటీవలే ఖరారు చేసి అక్టోబరు నుంచి కార్డుదారులకు పంపిణీ ప్రారంభించారు. సరఫరాలో జాప్యం కారణంగా కొన్ని జిల్లాలకు కందిపప్పు నిల్వలు ఆలస్యంగా చేరినా.. మిగతాచోట్ల మంగళవారం నుంచి పంపిణీ ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు.


వైకాపా హయాంలో కిలో కోత పెట్టి..

2019 వరకు రేషన్ కార్డుదారులకు రాయితీపై కిలో రూ.40 చొప్పున రెండు కిలోల కందిపప్పు ఇచ్చేవారు. వైకాపా రావడంతోనే కోత పెట్టి కేవలం కిలో చొప్పున పంపిణీ చేసింది. 2020 ఏప్రిల్ నుంచి కిలో ధర రూ.67కు పెంచింది. అయినా పూర్తిస్థాయిలో కార్డుదారులకు పంపిణీ చేయలేదు. ప్రతి నెలా మొత్తం కార్డుల్లో 25% నుంచి 35% మందికి మాత్రమే పప్పు అందేది. 2021 నవంబరు నుంచి 2023 డిసెంబరు వరకు చూస్తే సగటున 30% కుటుంబాలకే కందిపప్పు ఇచ్చారు. జూన్ నుంచి పంపిణీ నిలిపివేశారు. ప్రతి నెలా ధరలు పెరిగి వినియోగదారులపై భారం పడుతున్నా పట్టించుకోలేదు.

జనవరి నుంచి తృణధాన్యాల పంపిణీకి ప్రణాళికలు: మంత్రి నాదెండ్ల

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: ప్రతి నెలా రేషన్ కార్డుదారులకు రాయితీపై కందిపప్పు, పంచదార అందిస్తామని.. వచ్చే ఏడాది జనవరి నుంచి తృణధాన్యాలు కూడా పంపిణీ చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. తెనాలిలో మంగళవారం ఆయన కార్డుదారులకు రాయితీపై కిలో కందిపప్పు, అర కిలో పంచదార అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఎందుకా విజ్ఞానం?




మంచి వ్యక్తిత్వం లేనివారికి ఎంతటి విజ్ఞానం ఉన్నా అది దుష్ట శక్తి కిందే లెక్క. మనం ప్రపంచంలో తరచూ చూస్తుండే 'మహా తెలివైన దొంగలు', 'పెద్దమనుషుల్లాంటి వంచకులు' ఈ కోవలోని వారే!

– మహాత్మా గాంధీ

జాతిపిత 'స్వచ్ఛ' హితవు.. నగర సౌభాగ్యానికి హేతువు

- పారిశుద్ధ్యంతోనే విశాఖ అభివృద్ధికి బాటలు
- నేడు మహాత్మా గాంధీ జయంతి



కార్పొరేషన్, న్యూస్‌టుడే

'పారిశుద్ధ్యం మెరుగ్గా ఉన్న గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి పథంలో పయనిస్తాయి.. శుభ్రత ఉన్న చోట ప్రజలు ఆరోగ్యంగా ఉంటారు. అందుకే ప్రభుత్వాలు స్వచ్ఛతపై ఎక్కువ దృష్టి పెట్టాల'ని జాతిపిత మహాత్మా గాంధీ వందేళ్ల కిందటే ఉద్బోధించారు.


మహాత్ముని బోధనలు ఇప్పటికీ శిరోధార్యాలే. ఆ మాటల స్ఫూర్తితోనే ప్రధాని నరేంద్ర మోదీ స్వచ్ఛభారత్‌కు శ్రీకారం చుట్టారు. నేడు మహాత్మా గాంధీ జయంతి. ఈ సందర్భంగా విశాఖ పాలకులు బాపూజీ బోధనలను ఆచరణలో పెడితే నగరం అభివృద్ధి బాటలో దూసుకెళుతుందని నిపుణులు సూచిస్తున్నారు.

జాతీయ స్థాయిలో గుర్తింపు: దేశంలో గమ్య నగరంగా విశాఖ నగరానికి గుర్తింపు ఉంది. సుందర ప్రాంతం కావడంతో దేశవిదేశాల నుంచి నిత్యం వేలాది మంది పర్యాటకులు ఇక్కడికి వస్తుంటారు. వారిని ఆకర్షించడానికి ప్రభుత్వాలు నగరంలో పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టాయి. జీవీఎంసీ అధికారులు గత పదేళ్ల కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాలను అమలు చేస్తూ జాతీయ స్థాయిలో విశాఖకు స్వచ్ఛతలో గుర్తింపు తీసుకొచ్చారు. చెత్త సేకరణ, తరలింపు, నిర్వహణ పనులు సక్రమంగా జరుగుతున్నా.. కొన్ని లోపాలు కూడా ఉన్నాయి.. వాటిని సరిదిద్దితే నగరం మరింత స్వచ్ఛగా మారుతుంది.



సానుకూలతలు ఇవీ..

నగరంలో సేకరించిన చెత్తను కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు టాటా ఏస్ వాహనాల్లో చెత్త తరలింపు కేంద్రాలకు తరలిస్తున్నారు. పొడి చెత్తలోని కాగితాలు, అట్టలు, ప్లాస్టిక్ వ్యర్థాలను వేరు చేస్తున్నారు. జీవీఎంసీకి ఐదు చెత్త తరలింపు కేంద్రాలున్నాయి. ఆయా కేంద్రాల పరిసరాల్లో దుర్వాసన వెదజల్లకుండా సీసీఎస్ (క్లోజ్డ్ కాంపాక్షన్ సిస్టం) ప్రాజెక్టును అందుబాటులోకి తెచ్చారు. అక్కడి నుంచి చెత్తను కాపులుప్పాడ డంపింగ్‌యార్డుకు తరలిస్తున్నారు. అక్కడ పొడి చెత్తతో విద్యుత్తును తయారు చేస్తున్నారు.





ఇవీ లోపాలు...

నగరంలో 2,752 కిలోమీటర్ల మేర రహదారులున్నాయి. కాలువలు 4,232 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నాయి. రహదారులను శుభ్ర పరచడంతోపాటు కాలువల్లో వ్యర్థాల తొలగింపు సరిగా జరగడం లేదు. అదే విధంగా ఇంటింటి నుంచి చెత్త సేకరణ విషయంలోనూ ఫిర్యాదులు వస్తున్నాయి. వర్షం పడితే భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ నుంచి మురుగు పొంగి పొర్లుతోంది. వేలాది మంది పారిశుద్ధ్య కార్మికులు ఉన్నా.. ఈ పరిస్థితి ఎందుకు నెలకొందో సమగ్రంగా అధ్యయనం చేయాల్సి ఉంది.

ఇండోర్ నగరంతో పోటీ..

స్వచ్ఛభారత్ ర్యాంకింగ్‌లో గత కొన్నేళ్లుగా ఇండోర్ నగరం మొదటి స్థానంలో ఉంటోంది. విశాఖ నగరం ఆ స్థానాన్ని దక్కించుకోవాలంటే పారిశుద్ధ్య నిర్వహణలో మరిన్ని దిద్దుబాటు చర్యలు తీసుకోవాల్సి ఉంది. నగరంలో బహిరంగ మల విసర్జన ఎక్కడా జరగడంలేదని కేంద్ర ప్రభుత్వం నిర్ధారించింది. యూజీడీ అందుబాటులో ఉండటం, మురుగునీటి శుద్ధి కేంద్రాలు సక్రమంగా నిర్వహించడం వంటి చర్యలతో జీవీఎంసీకి 5 స్టార్ రేటింగ్ దక్కింది.

తాగునీటి సరఫరా పెంపు.. వీధి దీపాలకు వెలుగులు

కార్పొరేషన్, వన్‌టౌన్ న్యూస్‌టుడే: నగరంలో చేపట్టే అభివృద్ధి పనులు, ప్రాజెక్టులు శాశ్వతంగా ఉండేలా జీవీఎంసీ ప్రణాళికలు ఉండాలని విశాఖ ఎంపీ శ్రీభరత్ ఆదేశించారు. మంగళవారం ప్రభుత్వ అతిథి గృహంలో కూటమి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, జీవీఎంసీ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. నగరంలో ఒక ప్రాంతంలో చేసిన అభివృద్ధి పనిని తిరిగి జీవీఎంసీయే తొలగిస్తోందని, దీని వల్ల ప్రజాధనం వృథా అవుతోందన్నారు. తాగునీరు, వీధి దీపాల సమస్యలు త్వరగా పరిష్కరించాలన్నారు. నగరంలో ప్రమాదభరితంగా మారిన 136 (బ్లాక్ స్పాట్లు) ప్రాంతాల్లో కచ్చితంగా వీధి దీపాలు ఉండాలన్నారు. ప్రస్తుతం తాగునీరు 30 నిమిషాలు మాత్రమే సరఫరా చేస్తున్నారని, ఆ సమయాన్ని గంట పెంచాలన్నారు. 24 గంటలు సరఫరా చేయడానికి వనరులను సమకూర్చుకోవాలన్నారు. క్రీడా ప్రాంగణాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ పథకం ఖేల్ ఇండియా సహకారం తీసుకోవాలన్నారు. ★ భవిష్యత్తులో కొండవాలు ప్రాంతాల్లో ప్రమాదాలు జరగకుండా రక్షణ గోడలు నిర్మించడానికి కేంద్రం సహకారం తీసుకుంటామన్నారు. నగరంలో గెడ్డలు ఆక్రమణలకు గురయ్యాయని, ఇకపై ఎక్కడా ఆక్రమణలు జరగకుండా ప్రణాళికాధికారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జీవీఎంసీకి వివిధ సంస్థల నుంచి రావాల్సిన నిధులను తక్షణం వచ్చేలా చర్యలు చేపడతామన్నారు. ★ రాత్రి ఆహారవీధిలో అక్రమాలకు పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రస్తుతం ఉన్న దుకాణాలను తొలగించాలని ఎంపీ కోరారు. జీవీఎంసీ వెబ్‌సైట్‌ను ఆధునికీకరించాలని, యువత సహకారంతో నూతన యాప్‌లు తయారు చేయించాలని సూచించారు. ★ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ టిడ్కో ఇళ్ల కోసం డీడీలు చెల్లించిన లబ్ధిదారులకు గృహాలు మంజూరు చేయాలని కోరారు.

★ ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, విష్ణుకుమార్‌రాజు, గణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, ఎమ్మెల్సీలు వేపాడ చిరంజీవిరావు, దువ్వారపు రామారావు, తెదేపా ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్, చిత్రంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జీవీఎంసీ అధికారులు

డాక్టర్ రామరాజుకు ఏసీఈ జీవిత సాఫల్య పురస్కారం

వన్‌టౌన్, న్యూస్‌టుడే: నగరానికి చెందిన కృష్ణ ఐవీఎఫ్ క్లినిక్ వ్యవస్థాపకులు డాక్టర్ జీఏ రామరాజుకు క్లినికల్ ఎంబ్రియాలజిస్టుల అకాడమీ (ఏసీఈ) జీవిత సాఫల్య పురస్కారం లభించింది. ఏసీఈ 12వ అంతర్జాతీయ మహాసభలు పుణెలో జరుగుతున్నాయి. ఈ సమావేశంలో పాల్గొన్న ఆయనకు నిర్వాహకులు జీవిత సాఫల్య పురస్కారాన్ని అందజేసి అభినందనలు తెలిపారు. జనన, అసిస్టెడ్ రీ ప్రొడక్టివ్ టెక్నాలజీ (ఏఆర్‌టీ) రంగంలో డాక్టర్ రామరాజు చేసిన విశేషమైన కృషికి గుర్తింపుగా ఈ అవార్డు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఏసీఈ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ మజుందార్, ఇతర వక్తలు అభినందించారు.



డాక్టర్ జీఏ రామరాజుకు పురస్కారం అందజేస్తున్న ఏసీఈ నిర్వాహకులు

బసవతారకం ఆస్పత్రిలో మహిళా రోగులకు ఉచిత కన్సల్టేషన్

హైదరాబాద్, న్యూస్‌టుడే: బంజారాహిల్స్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో అక్టోబరు 1 నుంచి 20వ తేదీ వరకు మహిళా క్యాన్సర్ రోగులకు ఉచిత కన్సల్టేషన్ ఉంటుందని ఆసుపత్రి వర్గాలు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపాయి. అక్టోబర్ నెలను రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసంగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో 'స్క్రీనింగ్ ప్రోగ్రామ్ ఫర్ ఉమెన్' పేరిట ఈ సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. అన్ని పనిదినాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కన్సల్టేషన్ ఉంటుందని, మ్యామోగ్రామ్ పరీక్షల్లో 25 శాతం రాయితీ, ఇతర పరీక్షల్లో 10 శాతం రాయితీ ఇస్తున్నామన్నారు.

విశాఖ డీటీఓగా జి.ఆదినారాయణ బాధ్యతల స్వీకరణ

మాధవధార, న్యూస్‌టుడే: రోడ్డు భద్రత నిబంధనలపై వాహన చోదకులకు అవగాహన కల్పించి, తద్వారా ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకుంటామని జిల్లా రవాణాశాఖ డీటీఓ జి.ఆదినారాయణ తెలిపారు. మంగళవారం రవాణా కార్యాలయంలో డీటీఓగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు డీటీఓగా పనిచేసిన జి.సి. రాజారత్నం అమరావతిలోని రవాణాశాఖ కమిషనర్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ డీటీఓగా బదిలీ అయ్యారు. వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా విధుల్లో చేరిన ఆదినారాయణ జోన్-3 పరిధిలోని పలు ప్రాంతాల్లో పనిచేశారు. విజయనగరంలో ఆర్టీవోగా పనిచేసిన ఈయనకు డీటీఓగా పదోన్నతి రావడంతో, అప్పటి నుంచి అమరావతి కమిషనర్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. బదిలీల్లో భాగంగా ఈయనను విశాఖ డీటీఓగా నియమించారు. ఆన్‌లైన్ ద్వారా రవాణా సేవలు ప్రజలకు సత్వరమే అందేలా చూస్తామని ఆయన తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఆర్టీవోలు, వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది ఆయనకు అభినందనలు తెలియజేశారు.



డీటీఓగా బాధ్యతలు స్వీకరించిన జి.ఆదినారాయణకు అభినందనలు తెలియజేస్తున్న పూర్వ డీటీఓ జి.సి.రాజారత్నం

కార్డుదారులకు పండగ బొనంజా

ఈనెల కందిపప్పు, పంచదార పంపిణీ

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలోని రేషను కార్డుదారులకు కూటమి ప్రభుత్వం శుభవార్త అందించింది. దసరా, దీపావళి పర్వదినాల నేపథ్యంలో ఈనెల కందిపప్పు, పంచదార పంపిణీకి జెండా ఊపింది. ఈ మేరకు జిల్లా అవసరాలకు తగ్గట్టుగా సరకుల కేటాయింపులు జరపడంతో మంగళవారం రేషను డిపోల వారీ పంపిణీ ప్రారంభమైంది.

✶ జిల్లాలో 5.29 లక్షల కార్డులు ఉండగా, ప్రతి నెలా 225 టన్నుల వరకు కందిపప్పు అవసరం ఉంది. ఆ ప్రకారం అక్టోబరు నెలకు అవసరమైన సరకును రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ కేటాయించింది. తొలి విడతగా జిల్లాకు 30 టన్నుల వరకు వచ్చింది. మంగళవారం మరో 30 టన్నులు వచ్చే అవకాశం ఉంది. కిలో కందిపప్పు రూ.67 చొప్పున కార్డుదారులకు పంపిణీ చేస్తున్నారు. పంచదార సైతం జిల్లా అవసరాలకు 270 టన్నులు కేటాయించారు. అర కిలో రూ.17 చొప్పున కార్డుదారులకు ఇవ్వనున్నారు. ✶ రాష్ట్ర పౌరసరఫరాల శాఖమంత్రిగా నాదెండ్ల మనోహర్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆకస్మికంగా పౌరసరఫరాల గోదాములను తనిఖీ చేశారు. కందిపప్పు, పంచదారల్లో నాణ్యత లేకపోవడం, తూకాల్లో మోసాలను గుర్తించారు. దీంతో గత మూడు నెలల నుంచి వాటి పంపిణీ నిలిచిపోయింది. ఇప్పుడు మళ్లీ నాణ్యతతో కూడిన సరకు రావడంతో మంగళవారం నుంచి కందిపప్పు, పంచదార అమ్మకాలను ప్రారంభించామని జిల్లా పౌరసరఫరాల అధికారి వి.భాస్కర్ రావు తెలిపారు.



కార్డుదారులకు కందిపప్పు అందజేస్తున్న డీసీఎస్ఓ వి.భాస్కర్‌రావు

నిరసనకారులపై కేసు కొట్టివేత

విశాఖ లీగల్, న్యూస్‌టుడే: అందాల పోటీ సందర్భంగా నిరసన తెలిపిన మహిళా, ప్రజాసంఘాల ప్రతినిధులపై నమోదు చేసిన కేసును మంగళవారం మూడో అదనపు జూనియర్ సివిల్ న్యాయస్థానం న్యాయమూర్తి జి.కార్తీక్ కొట్టివేశారు. వివరాలిలా ఉన్నాయి.. 2017 సంవత్సరంలో నగరంలోని ఓ హోటల్‌లో అందాల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు మహిళలను కించపరిచేలా ఉన్నాయని ఆరోపిస్తూ ప్రజా, మహిళా సంఘాలు నిరసన తెలిపాయి. నిర్వాహకుల ఫిర్యాదుపై పోలీసులు మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు అత్తిలి విమల, ఎం.డి.బేగం, బి.పరమేశ్వరి, సి.హెచ్. నూకాలమ్మ, ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి. ప్రభావతి, ప్రగతిశీల మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి ఎం.లక్ష్మి, తదితర 27మందిపై కేసు నమోదు చేశారు. నిందితులపై నేరారోపణ రుజువు కాకపోవడంతో న్యాయమూర్తి కేసు కొట్టివేస్తూ తీర్పునిచ్చారు. ★ న్యాయస్థానం వెలువరించిన తీర్పుతో అందాల పోటీల నిర్వాహకులు, పోలీసులకు కనువిప్పు కలగాలని మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల అన్నారు. మహిళలను గౌరవించే వారెవరూ ఇకపై అందాల పోటీలు నిర్వహించరని ప్రగతిశీల మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి ఎం. లక్ష్మి పేర్కొన్నారు.



న్యాయస్థానానికి హాజరైన ప్రజా, మహిళా సంఘాల ప్రతినిధులు

భీమిలి

సి ని మా లు

చిట్టివలస(తగరపువలస), న్యూస్‌టుడే

గణేశ్ – సత్యం సుందరం
రాములమ్మ– దేవర,
తాతా – దేవర, సప్తగిరి– దేవర
మహరాజ్ (ఆనందపురం) – దేవర

తొట్లకొండ తీరంలో చిత్రీకరణ

గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: భీమిలి బీచ్‌రోడ్డులోని తొట్లకొండ తీరంలో హిట్‌-3 చిత్రం షూటింగు మంగళవారం జరిగింది. హీరో నాని, హీరోయిన్ నివేతా థామస్, ఇతర తారాగణంపై దర్శకుడు శైలేశ్ కొన్ని కీలక సన్నివేశాలను బీచ్‌లోనూ, బే వాచ్ పార్కులోనూ చిత్రీకరించారు. నాని ఇంతకుముందు నటించిన హిట్‌-1, 2 చిత్రాలకు సీక్వెల్‌గా దీనిని రూపొందిస్తున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి.

ఎండాడ, న్యూస్‌టుడే

సమస్య: తాటిచెట్లపాలెం నుంచి సాగర్‌నగర్ వరకు రాత్రివేళ వీధి దీపాలు వెలగక ఇబ్బందులు పడుతున్నాం. –గణేష్, స్థానికుడు

సమాధానం: వీధి దీపాల మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం. – సురేష్, విద్యుత్ ఏఈ

సమస్య: ఎండాడ తితిదే ఆలయ వాహనాల పార్కింగ్ ప్రదేశం (కొండ దిగువ)లో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. – చక్రవర్తి, రుషికొండ

సమాధానం: వీధి కుక్కల నివారణకు చర్యలు తీసుకుంటాం. – కిషోర్, ఆరోగ్య అధికారి

మేమున్నాం.. మీకు తోడుగా
80086 11711, 99122 22247
సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

నడక వంతెన కల.. సాకారం చేస్తాం..

విద్యార్థులు, పాదచారుల రాకపోకలకు మార్గం చూపుతాం

కొమ్మాది, న్యూస్‌టుడే


ఒక సమస్యకు శాశ్వత పరిష్కారం ఏమిటో అందరికీ తెలుసు.. అటువంటప్పుడు దానిని ఎంత త్వరగా చేయగలిగితే అంత మంచిది.. లేకుంటే అనర్థాలు జరిగే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం మధురవాడ కూడలి చంద్రంపాలెం ఉన్నత పాఠశాల ఎదురుగా జాతీయ రహదారిపై నడక వంతెన నిర్మించాలని ఉమ్మడి కూటమి, ప్రతిపక్ష, అఖిలపక్ష నాయకులు సైతం చెబుతున్నారు. ఈ సందర్భంగా సంబంధిత నేతల మనోగతం వారి మాటల్లోనే..

ఈ మార్గంలో నిత్యం వేలాది మంది విద్యార్థులు, పాదచారులు జాతీయ రహదారి దాటి వెళ్లడం, అదే సమయంలో వేగంగా వాహనాలు రావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రజలు నిత్యం ఆందోళనకు గురవుతున్నారు. ఎన్నో దశాబ్దాలుగా ఇక్కడ నడక వంతెన నిర్మించాలని కోరుతున్నా.. పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాపోతున్నారు. ఈ విషయంలో కూటమి పాలకులు తొందరగా చొరవ చూపి ఇక్కడి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు ఆకాంక్షిస్తున్నారు.


ప్రమాదకరంగా రహదారి దాటుతూ పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు



నడక వంతెన సమస్యను మంత్రి లోకేశ్‌కు వివరిస్తున్న స్థానిక నాయకులు (పాతచిత్రం)

వైకాపా హయాంలో గోతులు తవ్వి వదిలేశారు..



చంద్రంపాలెం పాఠశాలలో నిత్యం వేలాది మంది విద్యార్థులు రోడ్డు దాటేందుకు నరకయాతన పడుతున్నారు. గడచిన ఐదేళ్లలో వైకాపా ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించింది. ప్రజలను మభ్యపెట్టేందుకు ఎన్నికల ప్రకటన వచ్చే ముందు హడావుడిగా శంకుస్థాపన చేసి గోతులు తవ్వి వదిలేశారు. ఇక్కడ మరిన్ని ప్రమాదాలు జరగక ముందే కూటమి ప్రభుత్వం నడక వంతెన నిర్మాణం చేపట్టాలి.
– మరుపిళ్ల పైడిరాజు, జిల్లా కార్యదర్శి, సీపీఐ

త్వరలో పనులు చేపడతాం



వైకాపా ప్రభుత్వంలో నిలిచిపోయిన ఇక్కడి నడక వంతెన నిర్మాణాన్ని పూర్తి చేస్తాం. ఇటీవల ఈ ప్రాంతాన్ని సందర్శించిన మంత్రి లోకేశ్ సైతం ఈ విషయంలో సానుకూలంగా స్పందించారు. సీఎస్ఆర్ నిధులతో ప్రకాష్ ఆర్ట్స్ సంస్థ కూడా ముందుకొచ్చింది. ఎన్‌హెచ్ఏఐ (జాతీయ రహదారుల సంస్థ) అనుమతుల కోసం ఆ సంస్థ ప్రతినిధులు ఎదురుచూస్తున్నారు. సంబంధిత రెండు సంస్థలతో చర్చించి త్వరలో నడక వంతెన పనులు చేపడతాం. –గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే

రద్దీ సమస్యకు పరిష్కారం లభిస్తుంది



ఈ ప్రాంత సేవా రహదారులు నిత్యం ట్రాఫిక్‌తో కిక్కిరిసిపోతున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ ఏర్పడి గంటల కొద్ది ట్రాఫిక్‌లో ఉండిపోవాల్సిన పరిస్థితి. అండర్‌పాత్ వే లేదా నడక వంతెన నిర్మిస్తే రాకపోకలకు సులువుగా ఉంటుంది. లేకుంటే రానున్న రోజుల్లో అందరికీ ఇబ్బందే.
– డి.అప్పలరాజు, అధ్యక్షుడు, సీపీఎం మధురవాడ జోన్

దీన్ని సాధించేవరకు పోరాడతాం..



నడక వంతెన నిర్మించాలని మేయరకు, అప్పటి భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు వినతి పత్రాలు అందించాం. వారి కృషితో ప్రకాష్ ఆర్ట్స్ సంస్థ ముందుకొచ్చి పనులు చేపట్టినా ఎన్నికల కోడ్ వల్ల తర్వాత నిలిచిపోయాయి. ఈ సమస్యను కూటమి నాయకులకు, ఉన్నతాధికారులకు వివరించి వంతెన ఏర్పాటుకు కృషి చేస్తాం.
– ముత్తంశెట్టి లక్ష్మీప్రియాంక, 6వవార్డు వైకాపా కార్పొరేటర్

పాలకులకు సమస్య వివరించాం..



గతంలో ఇక్కడ రోడ్డు దాటుతుండగా ముగ్గురు విద్యార్థులు గాయపడ్డారు. అప్పుడే వారిని పరామర్శించి కూటమి ప్రభుత్వం రాగానే నడక వంతెన నిర్మాణానికి కృషి చేస్తామని హామీ ఇచ్చాం. తమ అధినేత పవన్‌కల్యాణ్ దృష్టికి సైతం తీసుకువెళ్లాం. ఈ సమస్యపై పాలకులతో చర్చించి వంతెన పనులు జరిగేలా చూస్తాం.
– డాక్టర్ పంచకర్ల సందీప్, జనసేన భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త

కృష్ణమయ్య కీర్తనం.. కూచిపూడి నర్తనం

సింహాచలం, న్యూస్‌టుడే: సింహగిరిపై జరిగిన శ్రీకాంత కృష్ణమాచార్యులు జయంతిని పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం చినముషిడివాడకు చెందిన నిర్మల నృత్య నికేతన్ విద్యార్థినులు 100 మంది నాట్యాచారిణి బి.విజయజ్యోతి పర్యవేక్షణలో కృష్ణమయ్య వచనాలకు కూచిపూడి నృత్యరీతులు ప్రదర్శించి అలరించారు. అనంతరం కృష్ణమయ్య చిత్రపటంతో సింహగిరిపై శోభాయాత్ర వేడుకగా జరిగింది. నృత్య కళాకారులను ఆలయ ఏఈవో ఎన్.ఆనంద్‌కుమార్ తదితరులు స్వామివారి జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు.


ఆలయ అధికారుల నుంచి సత్కారం అందుకున్న కళాకారులు

బెటాలియన్‌లో వార్షిక తనిఖీలు

కొమ్మాది: బక్కన్నపాలెం ఏపీఎస్పీ 16వ బెటాలియన్‌లో రెండవ రోజు మంగళవారం కూడా వార్షిక తనిఖీలు కొనసాగాయి. కవాతు, డ్రిల్, ఆయుధాల వినియోగం తదితర వాటిని కమాండెంట్ కె.వి. మురళీకృష్ణ పరిశీలించి పలు సూచనలు చేశారు. అదనపు కమాండెంట్ సీహెచ్.వి.ఎస్. పద్మనాభరాజు పాల్గొన్నారు.

3న జాబ్‌మేళా

భీమునిపట్నం, న్యూస్‌టుడే: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో భీమిలి ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో ఈనెల 3వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తారు. పది, ఇంటర్, డిగ్రీ, బి.టెక్ కోర్సుల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులు. ఆసక్తి ఉన్న వారు ఆరోజు ఉదయం 10 గంటలకు కళాశాలకు వచ్చి పేర్లు నమోదు చేసుకుని జాబ్‌మేళాలో పాల్గొనాలని కళాశాల ప్రధానాచార్యులు డా.సి.హెచ్.మురళీకృష్ణ పేర్కొన్నారు.

సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ

తగరపువలస, భీమునిపట్నం, కొమ్మాది, న్యూస్‌టుడే: జీవీఎంసీ భీమిలి జోన్ పరిధిలోని తగరపువలస, చిట్టివలస, కె.నగరపాలెం ప్రాంతాల్లో జోనల్ కమిషనరు పి.ప్రేమ ప్రసన్నవాణి, ఏపీడీ సంతోశ్‌కుమార్, తదితరులు మంగళవారం సామాజిక భద్రతా పింఛన్లను పంపిణీ చేశారు. ★ భీమిలి గ్రామీణ మండలంలో మండల పరిషత్తు అభివృద్ధి అధికారి ఎన్.హనుమంతురావు తదితరులు, భీమిలి ఎగువపేటలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, జీవీఎంసీ 5వవార్డు పరిధిలో తెదేపా కార్పొరేటర్ మొల్లి హేమలత వీటిని పంపిణీ చేశారు.

ఉల్లాసంగా..ఉత్సాహంగా..

పీఎంపాలెం, న్యూస్‌టుడే: పీఎంపాలెం వైజాగ్ కన్వెన్షన్‌లో 'సదరన్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్' వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అతిథులుగా విచ్చేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా సదరన్ హోటల్ మేనేజ్‌మెంట్ పదేళ్ల పండగ ఘనంగా నిర్వహించారు. సదరన్ గ్రూపు సంస్థల ఛైర్మన్ సతీష్ పొన్నం తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

నిత్యావసరాల ధరలు తగ్గించాలి

మధురవాడ, న్యూస్‌టుడే: పెరిగిన నిత్యావసరాల ధరలను తగ్గించే దిశగా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని సీపీఎం, సీఐటీయూ మధురవాడ జోన్ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మధురవాడ మార్కెట్ కూడలిలో మంగళవారం నిరసన చేపట్టారు. ప్లకార్డులు ప్రదర్శించి నినాదాలు చేశారు. నాయకులు డి.అప్పలరాజు, పి.రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి సైన్స్ సంబరాలు

పీఎంపాలెం, తగరపువలస, ఆనందపురం, న్యూస్‌టుడే: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పీఎంపాలెం సృజన పాఠశాలలో మంగళవారం జోనల్‌స్థాయిలో చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా వేర్వేరు పాఠశాలల నుంచి 8, 9, 10 తరగతులు చదువుతున్న 66 మంది హాజరయ్యారు. జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ సభ్యులు మాట్లాడుతూ... ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. మురళీధర్, అప్పలరెడ్డి, నరసింహమూర్తి, షరీఫ్, తదితరులు పాల్గొన్నారు. ★ వీటికి సంబంధించిన జోనల్, మండల స్థాయి పోటీలు ఆనందపురం, చిట్టివలస ఉన్నత పాఠశాలల్లో నిర్వహించారు.

తీరానికి కొట్టుకొచ్చిన గుర్తుతెలియని మృతదేహం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం మంగళవారం ఉదయం తీరానికి కొట్టుకొచ్చింది. దీనికి సంబంధించి మూడో పట్టణ పోలీసులు అందించిన వివరాలు ఉన్నాయి. ఆర్.కె.బీచ్ కాళీమాత ఆలయం ఎదురుగా గల తీరంలో మంగళవారం సుమారు 10 గంటల సమయంలో 55 సంవత్సరాల వయసుగల వ్యక్తి మృతదేహం తీరానికి కొట్టుకువచ్చింది. పోలీసులు మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించి మార్చురీలో భద్రపరిచారు. ఆచూకీ తెలిసినవారు మూడో పట్టణ పోలీసు స్టేషన్‌ను సంప్రదించాలని సి.ఐ. రమణయ్య కోరారు.

వైద్య వృత్తిలో సహనం అవసరం: ఎంపీ

మధురవాడ, సాగర్‌నగర్, న్యూస్‌టుడే: వైద్య వృత్తిలో ఉన్నతంగా రాణించేందుకు కృత్రిమ మేధ వంటి సాంకేతికతను ఉపయోగించుకుని స్వీయ ప్రతిభ పెంచుకోవాలని గీతం అధ్యక్షుడు, ఎంపీ ఎం.శ్రీభరత్ అన్నారు. గీతం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్సర్) వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన 'తెల్లకోటు ధారణ' కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. వైద్య వృత్తిలో కొనసాగాల్సిన వారికి ఓపిక, సహనం ఎంతో అవసరమన్నారు. రానున్న రోజుల్లో సంబంధిత రంగంలో సాంకేతిక పరిజ్ఞానం కీలక భూమిక వహించనుందన్నారు. విద్యార్థులు ఒత్తిడికి లోనవ్వకుండా నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఏపీ అధ్యక్షుడు డాక్టర్ ఎం.జయచంద్రనాయుడు మాట్లాడుతూ...వైద్యునిపై నమ్మకంతో వచ్చే రోగులను ప్రేమతో పలకరించి సేవలు అందించాలని సూచించారు. నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ మాట్లాడుతూ వైద్య విద్యార్థులకు మానవతా విలువలు, సమాజం పట్ల బాధ్యత అవసరమన్నారు. గీతం డీమ్డ్ వర్సిటీ ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య వై.గౌతమ్‌రావు, జిమ్సర్ ప్రో-వీసీ డాక్టర్ బి.గీతాంజలి కూడా మాట్లాడారు. 22 రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు ప్రస్తుత విద్యాసంవత్సరంలో వైద్య కళాశాలలో ప్రవేశం పొందారన్నారు. వైద్య విద్యార్థులకు సీపీ చేతుల మీదుగా తెల్లకోట్లు అందజేశారు. అనంతరం విద్యార్థులతో వృత్తి పట్ల నిబద్ధత, విలువలతో వ్యవహరిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వసంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గీతం అధ్యక్షుడు, ఎంపీ శ్రీభరత్


ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య విద్యార్థులు

కళాశాలలో అవగాహన సదస్సు

తగరపువలస, న్యూస్‌టుడే: తగరపువలస అవంతి ఇంజినీరింగు కళాశాలలో (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) అనే అంశంపై ఎంబీఏ విద్యార్థులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్ఆర్ గ్రూపు హెచ్ఆర్ హెడ్ జంపాన శ్రీనివాసరాజు విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ప్రిన్సిపల్ డా.బి.మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పొలంబడితో రైతులకు ఎంతో ప్రయోజనం

తగరపువలస, పద్మనాభం, న్యూస్‌టుడే: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోన్న పొలంబడి కార్యక్రమంతో రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరనుందని కలెక్టరు హరేంధిరప్రసాద్ అన్నారు. భీమిలి మండలం తాళ్లవలసలో మంగళవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు, శాస్త్రవేత్తలు ప్రతి మంగళ, బుధవారాల్లో గ్రామాలకు వెళ్లి రైతులకు ఆయా విషయాలపై అవగాహనతో పాటు సాంకేతిక అంశాలను వివరించడం ద్వారా అధిక దిగుబడులు సాధించాలన్నారు. అనంతరం సమీప పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. జిల్లా వ్యవసాయాధికారి అప్పలస్వామి తదితర అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

★ పద్మనాభం మండల వ్యవసాయాధికారి ఎం.వి.ఎస్.చలం నేతృత్వంలో మంగళవారం అనంతవరం పంచాయతీ గొల్లలపాలెం, బాందేవపురం గ్రామాల్లోనూ ఈ కార్యక్రమం నిర్వహించారు. రైతులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఏఈవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


తాళ్లవలసలో వరి పొలాన్ని పరిశీలిస్తున్న కలెక్టరు హరేంధిరప్రసాద్

కమనీయం.. అప్పన్న నిత్య కల్యాణం



సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామి వారి నిత్య కల్యాణోత్సవం మంగళవారం కమనీయంగా జరిగింది. అనంతరం ఆర్జిత సేవల్లో భాగంగా గరుడ వాహన సేవ ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. భక్తులు పాల్గొని స్వామికి ప్రదక్షిణలు చేసి మొక్కు తీర్చుకున్నారు. అర్చకులు భక్తులను వేదమంత్రాలతో ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ

తగరపువలస, న్యూస్‌టుడే: చిట్టివలస సంతపేటలో కొత్తమ్మతల్లిని వివిధ రకాల పూలతో, భీమిలి మండలం మజ్జివలస గ్రామదేవత రాసపోలమాంబను రుద్రాక్షలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని పూజలు చేశారు.


సంతపేట కొత్తమ్మతల్లి


మజ్జివలస రాసపోలమాంబ

పాఠశాలకు వితరణ

తాటితూరు(గ్రామీణభీమిలి), న్యూస్‌టుడే: భీమిలి మండలం తాటితూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు ఆ పాఠశాల 2003-04 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు మంగళవారం చేయూతనందించారు. ఇందులోభాగంగా పాఠశాల సైన్సు ల్యాబ్‌కి అవసరమైన బల్లలు, కుర్చీలు సమకూర్చారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, పూర్వ విద్యార్థులు సురేశ్, శ్రీను, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియం అభివృద్ధికి చర్యలు

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి కుమ్మరిపాలెం వద్ద నిర్మించిన ఇండోర్ స్టేడియం అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాథన్ అన్నారు. మంగళవారం ఆయన ఈ స్టేడియంను పరిశీలించారు. ఎనిమిదేళ్ల క్రితం రూ.4 కోట్లతో వీఎంఆర్డీఏ దీన్ని నిర్మించగా ప్రస్తుతం జీవీఎంసీలోని స్పోర్ట్స్ విభాగం పర్యవేక్షిస్తోంది. ఇందులో వుడెన్ ఫ్లోరింగ్, స్విమ్మింగ్‌పూల్ వంటి వసతులు కల్పించాలని క్రీడాకారులు కోరారు. జోనల్ కమిషనర్ పి.పి.ప్రసన్నవాణి, సహాయ ఇంజినీరు ఎ.సుమన్ తదితరులు పాల్గొన్నారు.


స్టేడియంను పరిశీలిస్తున్న వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాథన్, ఇతర అధికారులు

ఇలా ఉంటే ప్రమాదాలు జరగవా..

దర్పణం

మధురవాడ, న్యూస్‌టుడే: జీవీఎంసీ 8వ వార్డు ఎన్‌వీపీ న్యాయ కళాశాల రోడ్డులోని వ్యవసాయశాఖ కార్యాలయం గేటు పక్కన విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. చుట్టూ పిచ్చిమొక్కలు పెరగడంతో తరచూ విద్యుత్తు సరఫరాకు అవాంతరాలు ఎదురవుతున్నాయి. చిన్నపాటి వర్షం కురిస్తే నిప్పు రవ్వలు ఎగిసి పడుతున్నాయి. సమీపంలో అంధుల పాఠశాల ఉన్నందున ఏదైనా ప్రమాదం జరుగుతుందేమోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈపీడీసీఎల్ అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


పిచ్చిమొక్కల మధ్య ట్రాన్స్‌ఫార్మర్

రోడ్డు తొలగించేశారని ఫిర్యాదు

ఆనందపురం, న్యూస్‌టుడే: ఆనందపురం-పెందుర్తి రెవెన్యూ మండలాల సరిహద్దు ప్రాంతంలో 2012లో ఎంపీ నిధులతో ప్రభుత్వం వేసిన తారురోడ్డును దౌర్జన్యంగా తొలగించారని రామవరం గ్రామస్థులు జిల్లా జాయింట్ కలెక్టర్ మయూరి అశోక్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం గ్రామస్థులు మాట్లాడుతూ.. గత వైకాపా ప్రభుత్వ హయాంలో డి-పట్టా భూములు ఫ్రీ హోల్డ్ చేయడంతో కొందరు వ్యక్తులు తమ భూముల గుండా తారురోడ్డు ఉందన్న నెపంతో దౌర్జన్యంగా దాన్ని తొలగించేశారన్నారు. వెంటనే ఆ రహదారిని పునరుద్ధరించాలని గ్రామస్థులు కోరారు.

సీహెచ్‌సీలో వసతుల కల్పనకు తోడ్పాటు

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ)లో దివీస్ లేబొరేటరీ లిమిటెడ్ యాజమాన్యం అందించిన రూ.12 లక్షల ఆర్థిక తోడ్పాటుతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను మంగళవారం సీహెచ్‌సీ వైద్యపర్యవేక్షక అధికారి డా.ఎం.ఫణికుమార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సీహెచ్‌సీ అభివృద్ధికి దివీస్ అందిస్తున్న సహకారానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. దివీస్ సీఎస్ఆర్ ప్రతినిధులు ఎ.శ్రీనివాస్, కె.నరసింహ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ తూర్పు

ఇగ్నో ప్రవేశాల గడువు పెంపు

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో) జులై-2024 దూర విద్యాకోర్సులతో పాటు ఆన్‌లైన్ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన గడువును పెంచినట్లు ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ జి.ధర్మారావు వెల్లడించారు. అన్ని సర్టిఫికెట్, డిప్లమో, పీజీ డిప్లమో, డిగ్రీ, అన్ని పీజీ కోర్సుల్లో చేరటానికి అక్టోబరు 15 వరకు గడువు పెంచినట్లు తెలిపారు. ఈ విద్యాసంవత్సరానికి ఇగ్నో అనేక రంగాల్లో యువతకు ఉపాధి అవకాశాలు పెంచే కొత్త కోర్సులను అందిస్తుందన్నారు. ఈ ప్రవేశాలన్ని ఆన్‌లైన్ ద్వారా పొందాల్సి ఉంటుందన్నారు. http://ignouadmission.samarth.edu.in లింక్ ద్వారా ప్రవేశాలు లభిస్తాయన్నారు.

దసరా సెలవులు కచ్చితంగా పాటించాలి

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలు దసరా సెలవులను కచ్చితంగా పాటించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారామ్ ఒక ప్రకటనలో తెలిపారు. శతశాతం సెలవులు అమలుపై అన్ని జిల్లాల ఉన్నతాధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామన్నారు. దసరా సంబరాల పేరిట పరోక్షంగా తరగతులు నిర్వహిస్తే బాలల హక్కుల ఉల్లంఘనగా పరిగణిస్తామన్నారు. అలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకుంటామన్నారు.

తీరానికి కొట్టుకువచ్చిన వ్యక్తి మృతదేహం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ఆర్కేబీచ్ కాళీ మాత ఆలయం ఎదురుగా గల సముద్రంలో మంగళవారం ఉదయం ఓ వ్యక్తి మృతదేహం కొట్టుకువచ్చింది. పోలీసులు పరిశీలించి మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు. ఆ వ్యక్తి గురించి తెలిసిన వారు పోలీసులను సంప్రదించాలని కోరారు. అయితే సాయంత్రం ఆ వ్యక్తి కుటుంబ సభ్యులు మూడో పట్టణ పోలీసులను సంప్రదించారు. చనిపోయిన వ్యక్తి మురళీనగర్‌కు చెందిన మామిడి అప్పన్న(53)గా తెలిపారు. ఇతను మద్యానికి బానిసగా మారినట్లు తెలిసింది. అయితే ఆత్మహత్య చేసుకున్నాడా లేక సముద్రంలో ప్రమాదవశాత్తు మునిగిపోయాడా? అనేది పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కిలోన్నర గంజాయి స్వాధీనం

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : భీమిలి పోలీసుస్టేషన్ పరిధిలో అక్రమంగా గంజాయి కలిగిన ఓ వ్యక్తిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి కిలోన్నర గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం భీమిలి స్టేషన్‌కు అప్పగించారు.

వివాదస్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: ఎండాడ పరిధిలోని రవీంద్రనగర్‌లో సామాజిక అవసరాల కోసం వదిలిన స్థలాన్ని కాలనీ సంఘం ప్రతినిధులు ... జీవీఎంసీ అధికారులు స్పందించారు. మంగళవారం సచివాలయం కార్యదర్శులు స్థలాన్ని పరిశీలించి ... హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.



హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన అధికారులు

ముగిసిన స్వచ్ఛతా పక్షోత్సవాలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: బీచ్‌రోడ్డులోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ నాటికల్, ఇంజినీరింగ్ ట్రైనింగ్ (సిఫ్‌నెట్) యూనిట్ ఆధ్వర్యంలో సెప్టెంబరు 17 నుంచి జరుగుతున్న స్వచ్ఛతా పక్షోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా సంస్థ కార్యాలయంలో శిక్షణ పొందుతున్న వారికి, ఉద్యోగులకు స్వచ్ఛత పోటీలు నిర్వహించి విజేతలకు సంస్థ డిప్యూటీ డైరెక్టర్(డీడీ) హృషికేష్ బోరో బహుమతులు అందజేశారు.

వరద బాధితులకు విరాళాలు అందజేత

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావుకు కె.కోటపాడులో గల ... డిగ్రీ కళాశాల రూ.లక్ష, సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల రూ.80వేలు, సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల రూ.లక్ష, విజయనగరానికి చెందిన శ్రీలక్ష్మి గణపతి కళాశాల రూ. 12వేలు చొప్పున చెక్కులను అందజేశారు. వారికి రిజిస్ట్రార్ అభినందనలు తెలిపారు. ఏయూ సీడీసీ డీన్ ఆచార్య టి.వెంకట కృష్ణతో కలిసి ఆయా కళాశాలల ప్రతినిధులు రిజిస్ట్రారును కలిశారు.



ఏయూ రిజిస్ట్రార్‌కు చెక్కు అందిస్తున్న వెంకటకృష్ణ

ఘనంగా బాలయోగి జయంతి

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : ఆంధ్ర విశ్వవిద్యాలయం, రాజనీతి-ప్రభుత్వ పాలన శాస్త్ర విభాగంలో మంగళవారం గంటి మోహన్‌చంద్ర బాలయోగి 74వ జయంతి నిర్వహించారు. ఆచార్య పేటేటి ప్రేమానందం, ఆర్ట్స్ అండ్ కామర్స్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావులు బాలయోగి చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ప్రత్యేక ఆహ్వానితులుగా వచ్చిన ఆచార్య కోటి జాన్ మాట్లాడుతూ.. బాలయోగి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అనేక పదవులు నిర్వహించారన్నారు. డాక్టర్ వీర్రాజు, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ నాగరాజు, డాక్టర్ హరిబాబు, డాక్టర్ రత్నరాజు, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ ప్రియాంక పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బాలయోగి చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పిస్తున్న ఆచార్య ఎ.నరసింహారావు తదితరులు

నిధుల విడుదలే ఆలస్యం..!

గత ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభమై, నిధుల విడుదల జాప్యంతో మధ్యలో నిలిచిన ఆరిలోవ రైతుబజారుకు అవసరమైన నిధులు మంజూరుకు చర్యలు ప్రారంభమయ్యాయి. సుమారు 1.70 లక్షల మంది ప్రజలు ఉండే ఈ ప్రాంతంలో రైతుబజారును అందుబాటులోకి తీసుకువచ్చేలా నిధుల సమస్యను ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. దాదాపుగా 80 శాతం పనులు పూర్తికాగా, నిధులు వస్తే మిగిలిన పనులను సత్వరమే పూర్తి చేయనున్నారు.

ఆరిలోవ రైతుబజారును అందుబాటులోకి తెచ్చేందుకు సన్నాహాలు

న్యూస్‌టుడే, ఎంవీపీకాలనీ, ఆరిలోవ

తూర్పు నియోజకవర్గ పరిధిలో ఎంవీపీకాలనీ, పెదవాల్తేరు రైతుబజార్లున్నాయి. ఆరిలోవ ప్రాంతంలో స్థానికంగా రైతుబజారు లేకపోవటంతో 3 నుంచి 5 కి.మి. దూరంలో ఉన్న ఎంవీపీకాలనీ, సీతమ్మధార బజార్లను ఆశ్రయిస్తున్నారు.

■ గత తెదేపా ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు స్థల సేకరణకు ప్రతిపాదించగా, వైకాపా ప్రభుత్వ హయాంలో విమ్స్ ఆసుపత్రికి ఆనుకుని అర ఎకరం స్థలాన్ని కేటాయించి, బజారు నిర్మాణానికి రూ.60లక్షలు కేటాయించారు.

■ ఆరిలోవ ప్రాంతంలో సుమారు 4 వార్డులు విస్తరించగా, సుమారు 2 లక్షల మేర జనాభా ఉంటారని అంచనా వేస్తున్నారు. తోటగరువు పాఠశాలకు వెళ్లే మార్గంలో కేటాయించిన స్థలంలో రెండేళ్ల క్రితం పనులు ప్రారంభించారు. సుమారు 45 స్టాల్స్‌తో పాటు కార్యాలయం, వసతి గదులు, వాచ్‌మెన్ గది తదితర సదుపాయాలతో నిర్మాణ పనులు దాదాపుగా 80 శాతం వరకు పూర్తయ్యాయి.



నిర్మాణంలో ఉన్న స్టాల్స్

■ తొలివిడతగా గుత్తేదారుడికి రూ.45 లక్షల మేర నిధులు చెల్లించాల్సి ఉండగా, గత ఏడాది జనవరిలో రాష్ట్ర కార్యాలయానికి నివేదికను పంపించారు. ఈ నిధులను సీఎంఎఫ్ఎస్ ద్వారా విడుదల చేయాల్సి ఉండగా గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఇతర అవసరాలకు మళ్లించారు. దీంతో నిధుల విడుదల నిలిచిపోయింది. దీంతో 80 శాతం పనులతో గుత్తేదారుడు రైతుబజారు నిర్మాణాన్ని నిలిపివేశారు. నిధులు ఇస్తేనే జిల్లా అధికారులకు అప్పగిస్తామని చెప్పటంతో చేసేది లేక అధికారులు మిన్నకున్నారు.

■ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు బజారును అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రాధాన్యం ఇచ్చారు. రాష్ట్రమంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో నిధులకు సంబంధించిన దస్త్రాన్ని రాష్ట్ర కార్యాలయానికి పంపించారు. నిధులు త్వరలోనే మంజూరవుతాయని, అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే వెలగపూడి 'న్యూస్‌టుడే'కి తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM

ఎంవీపీకాలనీ 80085 74768 మద్దిలపాలెం 99121 20229

న్యూస్‌టుడే, ఎంవీపీకాలనీ

సమస్య : డీఆర్‌డీఏకు ఆనుకుని ఉన్న వీధిలో కార్యాలయ ప్రహరీ పక్కనే వ్యర్థాలు పడేస్తున్నారు – కిశోర్‌కుమార్

సమాధానం : సిబ్బందిని నియమించి వ్యర్థాలను తరలిస్తాం – సూరిబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

సమస్య : ఎంవీపీకాలనీ సెక్టారు-11లోని 86/ఎ/5 పోల్‌పై దీపాలు వెలగటం లేదు – కోటేశ్వరరావు

సమాధానం : పరిశీలించి పాడైతే మార్పు చేస్తాం – విక్రాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్

సంక్షేమ భవన్ ప్రాంగణంలో స్వచ్ఛతాహీ సేవ

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : గాంధీ జయంతిని పురస్కరించుకుని ప్రగతి భవన్(సంక్షేమ భవన్) ప్రాంగణంలో అన్ని జిల్లా శాఖల అధికారులు స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రగతిభవన్ పరిసరాలను శుభ్రం చేశారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్య పద్మ, డీఆర్‌డీఏ పీడీ శోభారాణి, సాంఘిక సంక్షేమశాఖ డీడీ కె.రామారావులతో పాటు వారి సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొని కార్యాలయ పరిసరాలు, ఆవరణను పరిశుభ్రం చేశారు. పైఅంతస్తులో వ్యర్థాలను సైతం తొలగించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇందుకు కార్యాలయ సిబ్బంది సహకరించాలని అధికారులు కోరారు. బీసీ, మహిళా సంక్షేమశాఖ, డీఆర్‌డీఏ, సాంఘిక సంక్షేమశాఖ, బీసీ కార్పొరేషన్, ఎస్సీ కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



ఆవరణ శుభ్రతలో పాల్గొన్న జిల్లా అధికారులు

అధిక ధరలు నియంత్రించాలి

ఆటోమోటివ్, (మద్దిలపాలెం), న్యూస్‌టుడే: అధిక ధరలు నియంత్రించాలని సీపీఎం మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం మద్దిలపాలెం జోన్ ఆధ్వర్యంలో మద్దిలపాలెం బస్‌స్టాండ్ సమీపంలో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు చలపతి, ఎ.అప్పారావు, పీతల అప్పారావు, పి.వెంకట్రావ్, ఎం.వి.త్రినాథరావు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.



మద్దిలపాలెంలో నిరసన చేపడుతున్న సీపీఎం నాయకులు

తెల్లవారుజాము నుంచే..! తొలిరోజు 96 శాతం పింఛన్లు పంపిణీ



ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లబ్ధిదారుడి వేలిముద్రలు తీసుకుంటున్న సిబ్బంది

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు అందజేసే సామాజిక పింఛన్ల పంపిణీ తొలిరోజు శరవేగంగా జరిగింది. ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకపోవటంతో జోన్-3లో సాయంత్రానికి 96.05 శాతం మేర పంపిణీ చేశారు. తూర్పు నియోజకవర్గ పరిధిలో ఎన్టీఆర్ భరోసా పేరిట తెల్లవారుజాము 5 గంటల నుంచే పంపిణీ చేపట్టగా, పలువురు నాయకులు పాల్గొన్నారు.

✦ జోన్-3 పరిధిలో మొత్తం లబ్ధిదారులు 15,141 మంది ఉంటే, సాయంత్రం 5 గంటలకు 14,543 మందికి (96.05 శాతం) మేర లబ్ధిదారులకు పింఛను మొత్తం అందజేయటం విశేషం.

ఫుడ్‌క్రాఫ్ట్ సేవలు భేష్

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్ ఎంతోమంది విద్యార్థులను హోటల్ రంగంలో ఉపాధి కల్పించిందని విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎం.శ్రీభరత్ అన్నారు. చినగదిలి మండల తహసీల్దార్ కార్యాలయం పక్కన గల ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో రక్షణ రంగ ఉద్యోగులకు కొత్త కోర్సు ప్రారంభ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో లెఫ్ట్‌నెంట్ కమాండెంట్ రంగథాలి, ప్రిన్సిపల్ కేవీ రమణ, అకడమిక్ అడ్వైజర్ డాక్టర్ ఉజ్వల్ కుమార్, అధ్యాపకులు పార్థసారథి, కుముదిని, సిబ్బంది ప్రసాద్, వైకుంఠం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్

ఎక్సైజ్ సీఐగా నాగవేణి బాధ్యతల స్వీకరణ



హెచ్‌బీకాలనీ, (మద్దిలపాలెం), న్యూస్‌టుడే : ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ సీతమ్మధార స్టేషన్ సీఐగా బి.నాగవేణి బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన వెంకట అప్పలనాయుడు అనకాపల్లి జిల్లా ఎన్‌ఫోర్సుమెంట్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నాగవేణి మాట్లాడుతూ.. బార్ల యజమానులు సమయపాలన పాటించాలన్నారు. వై.విమలాదేవి, బి.చల్లంనాయుడులు ఇదే స్టేషన్‌లో ఎస్.ఐ.లుగా బాధ్యతలు స్వీకరించారు.

బీచ్‌రోడ్డులో అవగాహన నడక

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని బీచ్‌రోడ్డులో మంగళవారం ఉదయం అవగాహన నడక నిర్వహించారు. వృద్ధుల సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన వాక్‌ను నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ ప్రారంభించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. తల్లిదండ్రుల సంరక్షణ మరవకూడదన్నారు. వృద్ధుల సంక్షేమ సంఘం ప్రతినిధులు కె.మంగపతిరావు, పీకే బోస్, అధిక సంఖ్యలో వృద్ధులు పాల్గొన్నారు.



నడకను ప్రారంభిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

కనకమహాలక్ష్మి సన్నిధిలో స్వర్ణ పుష్పార్చన



వన్‌టౌన్, న్యూస్‌టుడే: పాతనగరం బురుజుపేటలో కొలువైన కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో మంగళవారం అష్టదళ పాదపద్మారాధన పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేదపండితులు అమ్మవారికి 108 బంగారు పుష్పాలను నివేదించి అర్చించారు. ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు లక్ష కుంకుమార్చన సేవ జరిపారు. ఏఈఓ తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకులు ఎ.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర -2047 చర్చా గోష్ఠి

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎకనామిక్స్ డిపార్టుమెంట్‌లో స్వర్ణాంధ్ర-2047పై చర్చాగోష్ఠి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్ణాంధ్ర సాధించడానికి సంక్షేమంతో పాటు అభివృద్ధి జరగాలన్నారు. ప్రజల సహకారంతో రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమం ద్వారా సేకరించిన అభిప్రాయాలను రాష్ట్ర ప్రణాళిక విభాగానికి పంపించనున్నట్లు విభాగాధిపతి ఆచార్య ఎస్.పుల్లారావు తెలిపారు. కార్యక్రమంలో ఆర్థిక శాస్త్ర విభాగం ఆచార్యులు, ఆగ్రో-ఎకనామిక్ రీసెర్చ్ సెంటర్ గౌరవ డైరెక్టర్ బి.లిల్లీ గ్రేస్, డాక్టర్ డి.ఆశాలత, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల భాషా సామర్థ్యాల పరిశీలన

శివాజీపాలెం, (మద్దిలపాలెం), న్యూస్‌టుడే : జీవీఎంసీ పరిధి 20వ వార్డు శివాజీపాలెం నౌకానగర్ జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) ఎల్.చంద్రకళ, భీమిలి డైట్ అధికారులు ఎ.ఎం.ఒ.లక్ష్మీ తదితరులు సందర్శించారు. విద్యార్థుల భాషా సామర్థ్యాలను పరిశీలించారు. గగగగగ పుస్తకాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఎ.హెచ్.ఎం.దుర్గాకుమారి, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల పుస్తకాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ చిరంజీవిరావు, డీఈఓ చంద్రకళ, తదితరులు

ద్విచక్ర వాహనం ధ్వంసం



ధ్వంసమైన ద్విచక్రవాహనం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: తన ద్విచక్ర వాహనాన్ని కొందరు ధ్వంసం చేశారని బాధితుడు బొట్టా వెంకట రమణ ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శివాజీపాలెంలోని తన నివాసంలో ఉండగా.. అదే ప్రాంతానికి చెందిన తోనంగి చందుతో పాటు అతని స్నేహితులు రాడ్లు పట్టుకొని తనపై దాడిచేయడానికి ఇంటికి వచ్చారని.. తాను బయటకు రాకపోవడంతో ఇంటి ముందు పార్క్ చేసిన ద్విచక్ర వాహనాన్ని ధ్వంసం చేశారన్నారు. వచ్చిన ముగ్గురు గంజాయి మత్తులో ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎంవీపీ పోలీసు స్టేషన్ సి.ఐ. జె.మురళి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

అభివృద్ధి కొంతవరకే..



శిథిలావస్థలో ఓ తరగతి గది



భవనంలో కొంత భాగంలో జరిగిన అభివృద్ధి



పై అంతస్తుల్లో అభివృద్ధికి నోచుకోక దెబ్బతిన్న తలుపులు

ఆటోమోటివ్, (మద్దిలపాలెం), న్యూస్‌టుడే : ఒకే కళాశాలలో.. ఒక భవనంలో అభివృద్ధి ఏదో ఓ కొంత ప్రాంతానికే పరిమితం అయితే దానిని అభివృద్ధి అనవచ్చా? నగరం మధ్యలో ఉన్న కృష్ణా జూనియర్ కళాశాల పరిస్థితి అలాగే ఉంది. భవనం కింది భాగమంతా ఆధునికీకరణ నోచుకుంటే.. పైభాగమంతా శిథిలమై వెక్కిరిస్తోంది. మద్దిలపాలెంలో డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాల మూడు అంతస్తుల్లో కొనసాగుతోంది. ఈ భవనంలో 23 గదులు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఈ కళాశాల భవనం అభివృద్ధి నిమిత్తం నాడు-నేడు పనులను మొదలుపెట్టారు. దీనికోసం రూ. 1.20 కోట్ల నిధులు కేటాయించారు. ఆ నిధులతో గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తు కొంతభాగం అభివృద్ధి చేశారు. ఫ్లోరింగ్ బాగుచేశారు. విద్యార్థులు కూర్చునే బల్లలు, కొంత ఫర్నిచర్ సమకూరింది.

ఇంకా రావాల్సిన నిధులు..

నాడు.. నేడు పనులకు రూ.1.20 కోట్లు నిధులు కేటాయించగా.. ఇప్పటి వరకు రూ. 60 లక్షల నిధులు మాత్రమే విడుదలయ్యాయి. మిగతా నిధులు ఇంకా రూ. 60 లక్షలు రావాల్సి ఉండగా.. వీటిలో కొన్ని రకాల వస్తువులు నేరగా రాజధాని నుంచి వచ్చాయి. అవి మినహాయించుకున్నా ఇంకా సుమారు రూ. 30 లక్షల వరకు రావాల్సి ఉంటుంది.

✦ వచ్చిన నిధులు గ్రౌండ్‌ఫ్లోర్, మొదటి అంతస్తుకే సరిపోవడంతో ఆపై అంతస్తుల్లో తరగతి గదులు అధ్వానంగా మారాయి. గచ్చులు దెబ్బతిని ఉన్నాయి. పాత ఫర్నిచర్‌తోనే కొనసాగిస్తున్నారు. రంగులు వెలిసిపోయి ఉన్నాయి. ఉన్నతాధికారులు స్పందించి మిగతా నిధులు విడుదల చేసి కళాశాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది.

వ్యాయామంతో గుండె సమస్యలు దూరం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: వ్యాయామంతో గుండె సమస్యలు దూరమవుతాయని వైద్యులు పేర్కొన్నారు. బీచ్‌రోడ్డులో మంగళవారం ఉదయం ఇండస్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ప్రపంచ హృదయ వారోత్సవాల్లో భాగంగా అవగాహన నడక నిర్వహించారు. డాక్టర్ సుజాత, డాక్టర్ అనీల్‌కుమార్ మహాపాత్రో, హరివదన్, డాక్టర్ జాన్ ఎన్.వెస్లీ, ఇండస్ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిధర్ పాల్గొన్నారు.



అవగాహన నడకలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

ప్రశాంతంగా ఎంపిక పరీక్ష

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నీట్, జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్ శిక్షణ అందజేయడానికి మంగళవారం ఎంపిక పరీక్ష నిర్వహించారు. నగరంలోని ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో ఈ పరీక్ష జరిగింది. 236 మంది విద్యార్థులు హాజరైనట్లు జిల్లా వృత్తివిద్యాశాఖాధికారి బొడ్డేపల్లి రాధ తెలిపారు. త్వరలో ఫలితాలు వస్తాయన్నారు.



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి బి.రాధ

హోంగార్డులపై దాడి కేసులో నలుగురి అరెస్టు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: బీచ్‌రోడ్డులో హోంగార్డుల మీద దాడి సంఘటనలో నలుగురు వ్యక్తులను మూడో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం రాత్రి హోంగార్డులు, వీధి విక్రయదారులకు మధ్య జరిగిన ఘర్షణలో హోంగార్డులకు గాయాలైన సంగతి తెలిసిందే. ఈ సంఘటనలో పోలీసులపై దాడికి పాల్పడిన మజ్జి త్రినాథ్, గుడ యోగేంద్రరావు, చింతపల్లి వీర్రాజు, సరియం సాయిశరణ్‌లపై సి.ఐ. రమణయ్య కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

ఉక్కు పరిరక్షణకు నేడు నిరశన దీక్ష

కార్పొరేషన్, న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ నిలిపివేయాలని కోరుతూ బుధవారం అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరాహారదీక్ష చేపట్టనున్నట్లు సీఐటీయూ నాయకులు ఎం.జగ్గునాయుడు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు జరిగే ఈ దీక్షలో కార్మిక సంఘాల నాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు.

విశాఖ ఉత్తరం

•విశాఖ ఉత్తరం •విశాఖ దక్షిణం

రైతుబజార్‌లో స్వచ్ఛత


రైతుబజార్‌ను శుభ్రం చేస్తున్న సిబ్బంది

గురుద్వారా, న్యూస్‌టుడే: సీతమ్మధార రైతుబజార్‌లో మంగళవారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది బజార్ ఆవరణంలో గల చెత్తా చెదారాలు తొలగించి శుభ్రంచేశారు. ఎస్టేట్ అధికారి కొండబాబు, సహాయకులు సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

కార్యసిద్ధికోసం సుందరకాండ పారాయణ

మురళీనగర్, న్యూస్‌టుడే : ఎన్‌జీజీఓస్ కాలనీ కప్పరాడ శ్రీ వైభవుని దివ్యక్షేత్రంలో మంగళవారం సాయంత్రం సామూహిక సుందరకాండ పారాయణ నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ఎం.ఎస్.రామారావు ఆలపించిన సుందరకాండ ఘట్టాలను ఆలయ ప్రధాన అర్చకులు శేషస్వామి వివరించారు. కార్యసిద్ధికోసం ఈ పారాయణ ఎంతో మేలు కలుగజేస్తుందన్నారు. ఆలయ ఈఓ బండారు ప్రసాద్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.


సుందరకాండ పారాయణలో పాల్గొన్న భక్తులు

పారా స్విమ్మింగ్ పోటీల్లో ప్రతిభ


అనిల్‌సాహుతో కమిటీ సభ్యులు

మురళీనగర్, న్యూస్‌టుడే : నగరంలోని ఆర్ఆర్ ఆక్వా స్విమ్మింగ్‌పూల్‌లో గత నెల 29న జరిగిన రాష్ట్రస్థాయి పారా స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో వైజాగ్ స్విమ్మింగ్‌పూల్‌లో శిక్షణ పొందిన టి.అనిల్‌సాహు బహుమతి సాధించారు. కోచ్ రామారావు శిక్షణలో ఈ క్రీడాకారుడు 50మీటర్ల, 100మీటర్ల ఫ్రీస్టైల్‌లో ద్వితీయ బహుమతి సాధించినట్లు స్పోర్ట్స్‌పార్కు అధ్యక్షులు సనపల వరప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా సాహును పార్కు కమిటీ సభ్యులు అభినందించారు.

శ్రీగౌరీ సంక్షేమ సేవా సమితి వితరణ

కంచరపాలెం, మురళీనగర్ - న్యూస్‌టుడే: వరద బాధితుల సహాయార్థం సీఎం రిలీఫ్‌ఫండ్‌కు కంచరపాలెం ఊర్వశీకూడలిలో గల శ్రీగౌరీ సంక్షేమ సేవా సమితి ప్రతినిధులు ఉదారత చూపించారు. మంగళవారం పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబును కలిసి రూ.61 వేలను చెక్కు రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు పిల్లా రామకృష్ణ, కార్యదర్శి కాళ్ల వెంకటప్రసాద్, కోశాధికారి వి. సత్యనారాయణ, ఉపాధ్యక్షులు మళ్ల రామకృష్ణ, శ్రీ గౌరీ కళాశాల అధ్యక్షులు డాక్టర్ మాదేటి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే గణబాబుకు చెక్కు అందజేస్తున్న శ్రీగౌరీ సంక్షేమసేవా సమితి ప్రతినిధులు

తీరానికి కొట్టుకువచ్చిన వ్యక్తి మృతదేహం

పెదవాల్తేరు: ఆర్కేబీచ్ కాళీమాత ఆలయం ఎదురుగా గల సముద్రంలో మంగళవారం ఉదయం ఓ వ్యక్తి మృతదేహం కొట్టుకువచ్చింది. పోలీసులు పరిశీలించి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ఆ వ్యక్తి గురించి తెలిసిన వారు పోలీసులను సంప్రదించాలని కోరారు. అయితే సాయంత్రం ఆ వ్యక్తి కుటుంబ సభ్యులు మూడో పట్టణ పోలీసులను సంప్రదించారు. చనిపోయిన వ్యక్తి మురళీనగర్‌కు చెందిన మామిడి అప్పన్న(53)గా తెలిపారు. ఇతను మద్యానికి బానిసగా మారినట్లు తెలిసింది. అయితే ఆత్మహత్య చేసుకున్నాడా లేక సముద్రంలో ప్రమాదవశాత్తు మునిగిపోయాడా? అనేది పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కనకమహాలక్ష్మి సన్నిధిలో స్వర్ణ పుష్పార్చన



వన్‌టౌన్, న్యూస్‌టుడే: పాతనగరం బురుజుపేటలో కొలువైన కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో మంగళవారం అష్టదళ పాదపద్మారాధన పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేద పండితులు అమ్మవారికి 108 బంగారు పుష్పాలను నివేదించి అర్చించారు. ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు లక్ష కుంకుమార్చన సేవ జరిపారు. ఏఈఓ తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకులు ఎ. తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక అమలు చేయాలని డిమాండ్

కార్పొరేషన్, న్యూస్‌టుడే: తెదేపా, జనసేన కూటమి ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఉచిత ఇసుక ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 4న చేపట్టనున్న నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు కోరారు. మంగళవారం జగదాంబ సీఐటీయూ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇసుక అందుబాటులో లేకపోవడంతో నిర్మాణాలు పెద్ద ఎత్తున నిలిచిపోయాయని, జిల్లాలో సుమారు 50వేల మంది కార్మికులకు ఉపాధి లభించడం లేదన్నారు. ఆదాయాలు తగ్గిపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు ఆర్‌కేఎస్‌వీ కుమార్, ఎం. సుబ్బారావు, మూర్తి పాల్గొన్నారు.


ప్రచారపత్రం ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

ఉక్కు పరిరక్షణకు నేడు నిరశన దీక్ష

కార్పొరేషన్, న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ నిలిపివేయాలని కోరుతూ బుధవారం అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరాహారదీక్ష చేపట్టనున్నట్లు సీఐటీయూ నాయకులు ఎం.జగ్గునాయుడు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు జరిగే ఈ దీక్షలో కార్మిక సంఘాల నాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు.


అడుగువేస్తే గొయ్యి

ఫోకస్

సీతంపేట, న్యూస్‌టుడే

27వ వార్డు పరిధి శ్రీనగర్‌లో అడుగు తీసి అడుగు వేస్తే రహదారిపై గోతులు జనాల్ని ఇబ్బందులకు గురిచేస్తుంటాయి. దాదాపు అన్ని వీధుల్లో రహదారులపై ఇదే పరిస్థితి. రామాటాకీస్ నుంచి సత్యం కూడలికి వెళ్లే రహదారిలో రామాటాకీస్ కూడలి సమీపంలో రహదారిలో పెద్ద గోతులు రెండు ఏర్పడ్డాయి. ఇందులో ఒక గోతిలో మట్టివేసి కప్పే ప్రయత్నం చేశారు. మరో గోతిని అలాగే విడిచి పెట్టారు. రామాటాకీస్ కూడలి నుంచి బి.వి.కె.కళాశాల వైపు వెళ్లే రహదారిలో రెండేళ్ల క్రితం భూ గర్భ డ్రైనేజీ పనులు చేశారు. ఈ పనులు తర్వాత దానిపై సిమెంట్ కాంక్రీట్‌తో కప్పారు. ఈ పనుల్లో నాణ్యత లోపించడంతో అడుగడుగునా గోతులు ఏర్పడ్డాయి. రామాటాకీస్ కూడలి - సత్యం కూడలి రహదారి నుంచి రెడ్డి ఆసుపత్రి వీధిలోనూ పెద్ద గొయ్యి ఏర్పడింది. ఈ వీధిలోనూ రహదారిపై అడగడుగునా పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఈ గోతులు పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.


రామాటాకీస్ రోడ్డు నుంచి రెడ్డీ ఆసుపత్రి రోడ్డులో పడిన గొయ్యి



రామాటాకీస్ కూడలి సమీపంలో, సత్యం కూడలి రహదారిలో గోతులు

ఘనంగా వృద్ధుల దినోత్సవం


వృద్ధాశ్రమానికి సరకులు వితరణ చేస్తున్న దృశ్యం

మురళీనగర్, న్యూస్‌టుడే : ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని మహిళా వాకర్స్‌క్లబ్ ఘనంగా నిర్వహించారు. వీరి ఆధ్వర్యంలో మంగళవారం పట్టాభిరెడ్డితోటలోని వానప్రస్థ వృద్ధాశ్రమంలో ఉంటున్న వృద్ధులకు పండ్లు, అల్పాహారం అందజేశారు. అక్కయ్యపాలెంలో ఉన్న ప్రియదర్శిని వృద్ధాశ్రమానికి నిత్యావసర వస్తువులతో పాటు పండ్లు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు ఎస్.లలితారెడ్డి, పూర్వ అధ్యక్షులు డి.శిరీష, ఎం.శేషామణి, సి.హెచ్.వరలక్ష్మి, పి.కమల, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పేద వృద్ధులకు నిత్యావసరాల అందజేత

మురళీనగర్, న్యూస్‌టుడే : సెక్టార్-8 వైశాఖి స్పోర్ట్స్‌పార్కు, వనితావనంలో వనితా వాకర్స్‌క్లబ్ అధ్యక్షులు పొందూరు ప్రభావతి ఆధ్వర్యంలో ప్రపంచ వృద్ధుల దినోత్సవం నిర్వహించారు. కాలనీలో ఎటువంటి ఆసరాలేని పేదవృద్ధులకు దుప్పట్లు, నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఓల్డేజ్‌హోంకు వాకర్స్‌క్లబ్ వితరణ

మురళీనగర్, న్యూస్‌టుడే : వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం పెందుర్తిలో ఉన్న లయోలా ఓల్డేజ్ హోంకు నిత్యావసరాలు, దుస్తులు అందజేశారు. సుమారు 200మంది ఆశ్రయం పొందుతున్న వీరికి నెలకు సరిపడా పచారీ సామాన్లు పంపిణీ చేసినట్లు క్లబ్ అధ్యక్షులు పట్టా చంద్రమౌళి పేర్కొన్నారు. కార్యక్రమంలో వాకర్స్ ప్రతినిధులు రాళ్లపల్లి సత్యనాథం, జె.కూర్మారావు, సి.హెచ్.ప్రసాదరావు, ఎస్.ప్రకాశరావు, ఆర్.నాగేశ్వరరావు, ఎస్.రామ్మోహన్‌రావు, జి.రామకృష్ణ పాల్గొన్నారు.


వృద్ధులకు పండ్లు, దుప్పట్లు అందజేస్తున్న వనితా వాకర్స్ క్లబ్ సభ్యులు

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

కంచరపాలెం: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ మంగళవారం 48వ వార్డులో చురుగ్గా సాగింది. ఇందిరానగర్ 2,3 ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందజేశారు. వార్డు తెదేపా మహిళా నాయకురాలు గొర్లె నాగమణి, జనసేన అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మాధవధార, న్యూస్‌టుడే: 51వ వార్డులో కూటమి నాయకుల ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ చేశారు. మంగళవారం ఉదయం 6 గంటల నుంచే సచివాలయ సిబ్బంది నేరుగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి అందజేశారు. మొదటి రోజు దాదాపు 85శాతం పంపిణీ పూర్తయిందని తెలిపారు. ఉత్తర నియోజకవర్గంలో సుమారు 14,486 మంది లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేస్తున్నారు.

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: 27వ వార్డులో కార్పొరేటర్ గొలగాని వీరారావు, జోనల్ కమిషనర్ శివప్రసాద్ పింఛన్లు పంపిణీ చేశారు. 43వ వార్డు పరిధిలో తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బొడ్డేటి మోహన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

మేము న్నాం.. మీకు తోడుగా

గురుద్వారా, న్యూస్‌టుడే

సమస్య: టీపీటీకాలనీ ఎన్ఎంసీహెచ్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్తు మరమ్మతుల నిమిత్తం తొలగించిన చెట్లకొమ్మలు ఎండిపోయి దోమలు వృద్ధి చెందుతున్నాయి.
– అప్పారావు(స్థానికుడు)

సమాధానం: విద్యుత్తు సంస్థ దీనిపై దృష్టి సారించాలి. స్థానికులు ఇబ్బందులకు గురైతే తగు చర్యలు తీసుకుంటాం.
– పారిశుద్ధ్య అధికారి (24వ వార్డు)

సీతారామాలయంలో దేవీనవరాత్రి ఉత్సవాలు


దేవీ నవరాత్రుల పూజా ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న ఆలయకమిటీ

మురళీనగర్, న్యూస్‌టుడే : స్థానిక సీతారామాలయంలో ఈనెల 3నుంచి 12వరకు లలితాదేవి శరన్నవరాత్రి పూజా మహోత్సవాలు జరపనున్నట్లు ఆలయ ప్రధాన కార్యదర్శి సనపల వరప్రసాద్ తెలియజేసారు. దీనికి సంబంధించి పూజావివరాల ఆహ్వానపత్రికను మంగళవారం ఆలయంలో ఆవిష్కరించారు. ప్రతిరోజు ఉదయం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, కుంకుమపూజలు, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు టి.నారాయణరెడ్డి, పెంటకోట శ్రీనివాసరావు, ఎస్.ఎం.కె.మోహన్, పి.వెంకట్రావు, ఆలయ అర్చకులు ఎం.భానుమూర్తి, ప్రసాద్‌శర్మ, ఆలయకమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

గ్రామ ముఖద్వారం ప్రారంభోత్సవానికి ఆహ్వానం


ఎం.పి. ఎం.వి.శ్రీభరత్‌తో గౌరీ సేవా సంఘం నేతలు


అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: అక్కయ్యపాలెం ప్రధానరహదారి పక్కన జగన్నాథపురంలోని మూడుగుడుల సముదాయానికి వెళ్లే దారిలో అక్కయ్యపాలెం గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో గ్రామ ముఖద్వారం నిర్మాణాన్ని చేపట్టారు. దాన్ని ఎం.పి. ఎం.వి.శ్రీభరత్ చేతులమీదుగా ప్రారంభించేందుకు ఆహ్వానం పలికారు. మంగళవారం వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బొడ్డేటి మోహన్, సంఘం సభ్యులు కొయిలాడ వేణుగోపాల్, రాజగిరి అప్పలరాజు, మళ్ల త్రినాథ్, ఆదారి పారుపల్లి రవి తదితరులు ఆయన్ను మర్యాద పూర్వకంగా కలుసుకుని ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ నెల 9వ తేదీ బుధవారంనాడు ద్వారం ప్రారంభోత్సవంలో పాల్గొనవల్సిందిగా కోరారు.

బంగారు పతక విజేతకు సత్కారం

గురుద్వారా, న్యూస్‌టుడే: ఇటీవల మలేసియాలో జరిగిన అంతర్జాతీయ తైక్వాండో పోటీల్లో భారతదేశానికి బంగారు పతకం సాధించి మంగళవారం నగరానికి విచ్చేసిన క్రీడాకారుడు మలపర్తి ప్రకాశరావును పలువురు ఘనంగా సత్కరించారు. సీనియర్స్ 80 కేజీల విభాగంలో నగరం నుంచి ఎంపికై దేశం తరఫున పోరాడి ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. ఆతనికి ప్రోత్సాహం అందించిన దాత, విశాఖపట్నం 105 అయ్యన్ క్లబ్ ఇంటర్నేషనల్ గ్రాండ్ డండం పోలారావు, తిరుపతి రాజు, ఉషారాణి, విశ్వేశ్వరరావు, డీఎల్‌కే రావు, ఎం.వి.రాజశేఖర్‌లు క్రీడాకారుడు ప్రకాశరావు, కోచ్ పొన్నాడకి రుక్మారావులను శాలువ, పుష్పగుచ్ఛంతో సన్మానించారు. కార్యక్రమంలో పలువురు క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.


క్రీడాకారుడు ప్రకాశ్‌రావు, కోచ్ రుక్మారావులను సత్కరిస్తున్న పోలారావు, రాజశేఖర్, తదితరులు

విశాఖ జిల్లా అప్సా అధ్యక్షునిగా ఎం.వి.వి.సత్యనారాయణ



అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ అన్ ఎయిడెడ్ ప్రైవేటు స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (అప్సా) విశాఖ జిల్లా అధ్యక్షునిగా అక్కయ్యపాలెంలోని వాగ్దేవి పాఠశాల ప్రిన్సిపల్ ఎం.వి.వి.సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈయన 2024 -26 వరకు కొనసాగుతారు. ఎన్నికల అధికారిగా అప్సా మెంటర్ ఎ.కృష్ణారెడ్డి వ్యవహరించగా వీరిని డాక్టర్ ఎన్. శ్రీనివాసరావు, ఎం.వి.రావు, మళ్ల రామునాయుడు తదితరులు బలపర్చి హర్షం వ్యక్తం చేశారు.

నిందితులకు జరిమానా

మాధవధార, న్యూస్‌టుడే: కంచరపాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి పట్టుబడిన 7 మందిపై కేసులు నమోదు చేయగా, ఐదో ప్రత్యేక జ్యుడీషియల్ విభాగం జరిమానా విధించినట్లుగా కంచరపాలెం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సీఐ దాశరథి తెలియజేశారు. ఒక్కొక్కరికి రూ.10వేలు నుంచి రూ.13వేల చొప్పున మొత్తం రూ.63వేలు అపరాధ రుసుం విధించారు. ఇందులో ఏ.సంతోష్ అనే వ్యక్తికి పది రోజులపాటు సాధారణ కారాగార శిక్ష విధించారు.

ఉన్నతస్థానాల్లో నిలిపిన కళాశాలకు పేరు తేవాలి

కంచరపాలెం, న్యూస్‌టుడే: కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చదివిన ఎంతో మంది విద్యార్థులు నేడు ఉన్నత స్థానాల్లో ఉన్నారని ఇదే కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థి, స్టీల్‌ప్లాంటు జీఎం విజయకుమార్ తెలిపారు. మంగళవారం కళాశాలలో మెకానికల్ విభాగం (మెట్రిక్) వేడుకల్లో పాల్గొని మాట్లాడుతూ ప్రస్తుత విద్యార్థులు బాగా చదువుకుని మంచి స్థానాల్లో ఉండాలని కోరారు. ప్రిన్సిపల్ డాక్టర్ నారాయణరావు, మధుకుమార్, స్వామిరావు అధ్యాపకులు ఎస్.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.


స్టీల్‌ప్లాంటు జీఎం విజయకుమార్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపల్ నారాయణరావు, ఎస్.వి.రమణ తదితరులు


అగ్ని ప్రమాదాల నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అగ్ని ప్రమాదాల నివారణపై మాక్‌డ్రిల్

మాధవధార, న్యూస్‌టుడే: మానవ తప్పిదాల వల్ల అగ్ని ప్రమాదాలు సంభవిస్తాయని, అప్రమత్తంగా ఉండాలని జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి కె.వి.టి.ప్రసాద్ తెలియజేశారు. మంగళవారం ఆర్అండ్‌బీ వద్ద ఉన్న మారియట్ హోటల్ సిబ్బందికి అగ్ని ప్రమాదాల నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మాక్ డ్రిల్ నిర్వహించారు. అగ్నిమాపక సిబ్బంది ఏ. చిరంజీవి, ఆర్. చిన్నా పాల్గొన్నారు.

సనాతన ధర్మాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: సనాతన ధర్మాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అంటూ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ దొండపర్తిలోని రామాలయంలో మంగళవారం 'ఓం నమో నారాయణాయ' కార్యక్రమాన్ని చేపట్టారు. మంత్రాన్ని జపిస్తూ పూజలు నిర్వహించారు. కూటమి నాయకులు పాల్గొన్నారు. అక్కయ్యపాలెం పుట్టబంగారయ్య ఆలయంలో జరిగిన 'సమో నారాయణాయ' మంత్ర జపంలో జనసేన సమన్వయకర్త పసుపులేటి ఉషాకిరణ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ, నాయకులు గార్నేట లక్ష్మి, వరలక్ష్మి, దివాకర్, భాస్కర్, త్రినాథ్, గోకుల్‌కళ్యాణం, తదితరులు పాల్గొన్నారు.


దొండపర్తి రామాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

నేలకు చేరని వెలుగులు

డాబాగార్డెన్స్ (అల్లిపురం), న్యూస్‌టుడే

నగరంలోని పలు ప్రాంతాల్లో వీధి దీపాలు వెలుగుతున్నా చీకటి అలముకుంటోంది. జీవీఎంసీ ఉద్యాన విభాగం ఆయా ప్రాంతాల్లో నాటిన మొక్కలు ఏపుగా పెరిగి వృక్షాలయ్యాయి. వాటి కొమ్మలు వీధి దీపాల వెలుగులు నేలకు ప్రసరించకుండా అడ్డుకుంటున్నాయి. ఉద్యాన విభాగ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేసి దీపాలను కమ్మేసిన కొమ్మలను తొలగించాల్సి ఉంది. అధికారులు, సిబ్బంది నిర్లక్ష్య వ్యవహరిస్తుండడంతో రహదార్లపై వెలుగులు లేక వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో నామమాత్రంగా కొమ్మలు తొలగించారు. తిరిగి కొద్ది నెలల్లో అవి పెరిగి దీపాలకు అడ్డంగా మారాయి. దక్షిణ నియోజకవర్గంలో రద్దీగా ఉండే చావలమదుం నుంచి పాతజైలు రోడ్డు, కెప్టెన్ రామారావు కూడలి, రైల్వే రిజర్వేషన్ కౌంటర్ కార్యాలయం తదితర ప్రాంతాల్లో ఈ సమస్య అధికంగా ఉంది. ఈ ప్రాంతాల్లో వీధి దీపాలు వెలుగుతున్నా పాదచారులు, వాహనచోదకులకు ఉపయోగపడడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉద్యానవిభాగ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


పాతజైలు రోడ్డు మార్గంలో చెట్టు మధ్యలో వీధి దీపం


కెప్టెన్ రామారావు కూడలిలో దీపాన్ని మూసివేసిన చెట్టు కొమ్మలు

చురుగ్గా పింఛన్ల పంపిణీ

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జీవీఎంసీ 29వ వార్డులోని లబ్ధిదారులకు మంగళవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను సచివాలయ ఉద్యోగులు పంపిణీ చేశారు. అంగడిదిబ్బ, దండుబజార్ తదితర ప్రాంతాల్లో ఉదయం 6గంటల నుంచే పంపిణీ ఆరంభమైంది. వార్డు కార్పొరేటరు ఉరికూటి నారాయణరావు, సచివాలయ ఉద్యోగులు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.


అంగడిదిబ్బ ప్రాంతంలో పింఛన్లు అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

స్వామి వివేకానంద సంస్థకు నిత్యావసరాల వితరణ

వన్‌టౌన్, న్యూస్‌టుడే: పాతనగరంలోని స్వామి వివేకానంద సేవా సంస్థకు రోటరీ క్లబ్ విశాఖపట్నం సభ్యులు, సంఘ సేవకురాలు మయాంక్ కుమారి రూ.25వేల విలువ చేసే నిత్యావసరాలను వితరణగా ఇచ్చారు. శక్తి విక్రందేవ్ జ్ఞాపకార్థం 8 బస్తాల బియ్యం, వంట నూనె, చింతపండు, కందిపప్పు, కారం, ఉప్మారవ్వ, సబ్బులు, పేస్టులు, తదితర నిత్యావసరాలను మంగళవారం అందించారు. దాత ఆశ్రమవాసులతో కొంతసేపు మాట్లాడి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. సంస్థ అధ్యక్షులు సూరాడ అప్పారావు, రోటరీ క్లబ్ విశాఖపట్నం అధ్యక్షులు వినయ్ గాంధీ, కార్యదర్శి మణిమాల తదితరులు పాల్గొన్నారు.


స్వామి వివేకానంద సంస్థకు నిత్యావసరాలు అందజేస్తున్న దాతలు

ముగిసిన స్వచ్ఛతా పక్షోత్సవాలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: బీచ్‌రోడ్డులోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ నాటికల్, ఇంజినీరింగ్ ట్రైనింగ్ (సిఫ్‌నెట్) యూనిట్ ఆధ్వర్యంలో సెప్టెంబరు 17 నుంచి జరుగుతున్న స్వచ్ఛతా పక్షోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా సంస్థ కార్యాలయంలో శిక్షణ పొందుతున్న వారికి, ఉద్యోగులకు స్వచ్ఛతా కిట్లు, వివిధ పోటీల విజేతలకు సంస్థ డిప్యూటీ డైరెక్టర్(డీడీ) హృషికేష్ బిసోయ్ బహుమతులు అందజేశారు. స్వచ్ఛత కార్యక్రమాలపై అవగాహన, పచ్చదనం పెంపు కార్యక్రమాలతో పాటు వాక్‌థాన్ వంటి పోటీలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్న వారిని డీడీ అభినందించారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న హృషికేష్ బిసోయ్

ఇంటింటి ఓటరు సర్వే 95శాతం పూర్తి

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలో చేపడుతున్న సంక్షిప్త ఓటర్ల జాబితా తయారీలో అభ్యంతరాల స్వీకరణ, పరిశీలన పక్కాగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) వివేక్ యాదవ్ సూచించారు. మంగళవారం సాయంత్రం అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో ఆయన మాట్లాడారు. జిల్లా నుంచి కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్, డీఆర్వో మోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఇంటింటి సర్వే, స్వీప్, పోలింగ్ కేంద్రాల పెంపు, తదితర అంశాలను సీఈఓ తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటింటి సర్వే ప్రక్రియ జిల్లాలో 95శాతం పూర్తయిందని చెప్పారు. అభ్యంతరాల స్వీకరణ, పరిశీలన పక్కాగా చేపడుతున్నామని, సవరణల కోసం వచ్చిన దరఖాస్తుల్లో 8744 పెండింగ్‌లో ఉన్నాయని, అక్టోబరు 5వ తేదీలోపు వాటిని పరిష్కరిస్తామన్నారు. బీఎల్‌ఓల స్థాయిలో ఉన్న 11వేల దరఖాస్తులపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో 2850 మంది మృతి చెందిన ఓటర్లు ఉన్నట్లు గుర్తించామన్నారు. పోలింగ్ కేంద్రాల పెంపుపై రాజకీయపక్షాలతో సమావేశమై అభిప్రాయాలు సేకరించినట్లు వివరించారు. సమావేశంలో భీమిలి ఆర్డీఓ భాస్కర్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న డీఆర్వో కె.మోహన్‌కుమార్, అధికారులు

'గొంతు తెగిన అక్షరం' పుస్తకావిష్కరణ

కార్పొరేషన్, న్యూస్‌టుడే: యువ కవి సిర్పి చంద్రశేఖర్ రచించిన గొంతు తెగిన అక్షరం పుస్తకాన్ని మంగళవారం ఏవీఎన్ కళాశాలలో ఆవిష్కరించారు. సహృదయ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రిన్సిపల్ ఎం. సింహాద్రినాయుడు మాట్లాడుతూ చిన్న వయసులోనే కవిగా, రచయితగా పేరు ప్రఖ్యాతలు సాధించిన చంద్రశేఖర్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆయన మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. డాక్టర్ డీవీ సూర్యారావు, శేఖరమంత్రి ప్రభాకర్ చంద్రశేఖర్‌ను అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కృష్ణకుమారి, అధ్యాపకులు శంకర్ నారాయణరావు, స్వరాజ్యలక్ష్మి, పి. వెంకటరత్నం, డబ్బీరు గాయత్రి, నరసింహమూర్తి, పైడి రజిని తదితరులు పాల్గొన్నారు.


చంద్రశేఖర్‌ను సత్కరిస్తున్న అధ్యాపకులు

నేడు కరాటే పోటీల గోడపత్రికల ఆవిష్కరణ

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: వైజాగ్ ఓపెన్ జాతీయస్థాయి కరాటే పోటీల గోడపత్రికల ఆవిష్కరణ కార్యక్రమం పోర్టు స్టేడియంలోని విశ్వనాథ స్పోర్ట్స్ క్లబ్ వద్ద బుధవారం ఉదయం 10.30గంటలకు జరగనుందని టోర్నీ నిర్వాహకులు సిహెచ్. సతీష్‌కుమార్ తెలిపారు. డిసెంబరు 15 నుంచి పోటీలు జరగనున్నాయన్నారు. గోడపత్రికల ఆవిష్కరణలో సినీనటుడు సుమన్ పాల్గొంటారని పేర్కొన్నారు.

గాజువాక

• గాజువాక • విశాఖ పశ్చిమం

విద్యార్థి దశ ఎంతో కీలకం

గాజువాక, న్యూస్‌టుడే : ప్రతి ఒక్కరి జీవితంలో విద్యార్థి దశ ఎంతో కీలకమని మాజీ ఎమ్మెల్సీ మాధవ్ అన్నారు. మంగళవారం చైతన్య మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో స్వచ్ఛభారత్ మిషన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మాధవ్ మాట్లాడుతూ... విద్యార్థులు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని సూచించారు. ప్రిన్సిపల్ చంద్రమహాలక్ష్మి అధ్యక్షత వహించారు. అధ్యాపకులు హాజరయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ మాధవ్

కోత విధించిన వేతనం చెల్లించాలని డిమాండ్

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : ఒప్పంద పారిశుద్ధ్య కార్మికుల జీతాల నుంచి కోత విధించిన 2 శాతం ఆదాయ పన్ను మొత్తాలను కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలంటూ పలువురు కోరారు. ఈ మేరకు మంగళవారం 64, 65 వార్డుల పారిశుద్ధ్య కార్మికులు మస్టర్ కార్యాలయాల వద్ద నిరసన చేపట్టారు. కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ కార్యదర్శి జి.అప్పారావు మాట్లాడుతూ... వివిధ అంక్షల పేరుతో జీతాల్లో కోత పెట్టి, కార్మికులను ఇబ్బందులకు గురి చేయడం తగదన్నారు.

నేడు రక్తదాన శిబిరం

గాజువాక, న్యూస్‌టుడే : గాంధీ జయంతి సందర్భంగా బుధవారం ఉదయం రాష్ట్ర బీసీ సంఘం ఆధ్వర్యంలో పాతగాజువాక కూడలిలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు నిర్వాహక కమిటీ ప్రతినిధి జాగరపు శ్రీను మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

గాజువాక: 98494 65088

పశ్చిమం (గోపాలపట్నం): 95428 96869

న్యూస్‌టుడే, గాజువాక, పెదగంట్యాడ

సమస్య : కూర్మన్నపాలెం ఆర్కే రెసిడెన్సీ వద్ద రహదారి అధ్వానంగా ఉంది. గోతులతో నానా ఇబ్బందులు పడుతున్నాం.
–టీవీఎల్.సూర్యనారాయణ, కూర్మన్నపాలెం

సమాధానం: అంచనాలు రూపొందించి మరమ్మతులు చేయిస్తాం. –అప్పారావు, ఈఈ.

?: జీవీఎంసీ 87వ వార్డు ఉప్పరవానిపాలెం, కాశీపాలెంలో కాలువలు శిథిలమై, మురుగు ముందుకెళ్లడం లేదు. –సూర్య, వడ్లపూడి

✔: పారిశుద్ధ్య సిబ్బందిని పంపి అవసరమైన చర్యలు తీసుకుంటాం.
–డాక్టర్ కిరణ్‌కుమార్, ఏఎంఓహెచ్

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్య సమాజం

వార్డుల్లో 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమాలు


వ్యర్థాలు సేకరించిన వాలంటీర్లు

సింధియా(జవహర్‌నగర్), న్యూస్‌టుడే : నేటి యువత స్వచ్ఛతకు ప్రాధాన్యం ఇవ్వాలని సెయింట్ ఆన్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి అన్నారు. మంగళవారం కళాశాల ఆవరణలో నిర్వహించిన 'స్వచ్ఛతా హీ సేవా' ముగింపు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. జాతీయ సేవా పథకం వాలంటీర్లు ఐక్యంగా స్వచ్ఛ కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. ఎన్ఎస్ఎస్ జిల్లా పీవో భాగ్యలక్ష్మి, కళాశాల పీవోలు వై. అనసూయ దేవి, అంజలీదేవి, సంధ్యారాణి పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్య సమాజం నిర్మితమవుతుందని 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్ అన్నారు. మంగళవారం వార్డు పరిధి సిద్ధార్థనగర్, యాదవ వీధిలో శ్రమదానం చేశారు. తిరుమలనగర్ సంక్షేమ సంఘం సభ్యులు నాగభూషణం, పరమానందం, ఏఎంహెచ్‌ఓ కిరణ్‌కుమార్, పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్ అప్పారావు, సిద్ధార్థనగర్ కాలనీ సంఘం సభ్యులు బి.నాగేశ్వరరావు, ఎన్.మూర్తి, కృష్ణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : గాజువాక స్టీల్‌సిటీ ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రతతో స్వచ్ఛ విశాఖ కల సాకారమవుతుందన్నారు. పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

కరాస, న్యూస్‌టుడే : స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా మంగళవారం ఉదయం మర్రిపాలెం రైతుబజారులో ప్లాస్టిక్ నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించి, పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలని కూరగాయల దుకాణదారులకు అవగాహన కల్పించారు. ఎస్టేట్ అధికారి వరహాలు, సహాయకుడు ప్రశాంత్, జీవీఎంసీ పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.


సిద్ధార్థనగర్‌లో శ్రమదానం


గాజువాక స్టీల్‌సిటీ ఐటీఐ ప్రాంగణంలో..

బాపూజీ స్ఫూర్తితో ముందడుగు


చిన్నారి విజేతలతో డీసీపీ తుహిన్ సిన్హా, ట్వింకిల్ శ్యామ్

గాజువాక, న్యూస్‌టుడే : నేటి విద్యార్థులు జాతిపిత బాపూజీ స్ఫూర్తితో ముందుకు సాగాలని విశాఖ జోన్-2 డీసీపీ తుహిన్ సిన్హా అన్నారు. మంగళవారం 70వ వార్డు శ్రీనివాసనగర్ ట్వింకిల్ స్కూల్ ఆవరణలో గాంధీ జయంతి సందర్భంగా బాలలకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డీసీపీ మాట్లాడుతూ... చదువుతో పాటు సామాజిక స్పృహతో మెలగాలన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కరస్పాండెంట్ ట్వింకిల్ శ్యామ్ మాట్లాడుతూ... విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంచడానికి తరచూ ఇలాంటి పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రిన్సిపల్ ఎస్.కరుణకుమారి అధ్యక్షత వహించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

షిప్‌యార్డు కాలనీ(మల్కాపురం), న్యూస్‌టుడే : గాంధీజీ ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని షిప్‌యార్డు కో-ఆపరేటివ్ బ్యాంకు సీఈవో అనిల్ కుమార్ అన్నారు. మంగళవారం షిప్‌యార్డు కాలనీలోని బ్యాంకులో గాంధీ జయంతి నిర్వహించారు. డైరెక్టర్లు రమ్య, సూరిబాబు, నూకరాజు, మేనేజర్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు శ్రీదేవి, హరినాధ్ తదితరులు పాల్గొన్నారు.


షిప్‌యార్డు కో-ఆపరేటివ్ బ్యాంకులో...

● పెదమడకలో అన్నసమారాధన

అగనంపూడి, న్యూస్‌టుడే: పెదమడక కాలనీ శ్రీ ఉమామహేశ్వర స్వామి ఆలయంలో మాస శివరాత్రి సందర్భంగా మంగళవారం భక్తులకు అన్నదానం చేశారు. కమిటీ ప్రతినిధులు అప్పలనాయుడు, వరహాలు, పైడిరాజు, సత్యవతి, అప్పారావు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

● యోగా పోటీల్లో ప్రతిభ



సింధియా, న్యూస్‌టుడే: మల్కాపురం పోలీస్‌స్టేషన్‌కు చెందిన మహిళా హెడ్ కానిస్టేబుల్ చిన్నారికి జాతీయస్థాయి యోగా పోటీల్లో కాంస్య పతకం దక్కింది. గత నెల 23 నుంచి 27 వరకు ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన పోలీస్ క్లస్టర్ ఛాంపియన్‌షిప్ 2024-25 పోటీల్లో ఆమె ప్రతిభ చూపారు. గతంలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో ఆమె బంగారు పతకాన్ని సాధించారు. చిన్నారి ప్రతిభను సీపీ శంఖబ్రత బాగ్చీ, మల్కాపురం సీఐ ఎస్. విద్యాసాగర్, ఇతర సిబ్బంది ప్రశంసించారు.

● వైకాపా ఆత్మీయ సమావేశం

సింధియా, న్యూస్‌టుడే : పారిశ్రామిక ప్రాంతం శ్రీహరిపురం పార్టీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం వైకాపా ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి పశ్చిమ నూతన ఇన్‌ఛార్జి మళ్ల విజయప్రసాద్ హాజరై మాట్లాడారు. నియోజకవర్గంలో పార్టీకి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా కృషి చేయాలన్నారు. సమావేశానికి హాజరైన వారు మళ్ల విజయప్రసాద్‌ను సత్కరించారు.

● 100 యూనిట్ల రక్తం సేకరణ

కూర్మన్నపాలెం(దువ్వాడ): విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల, లయన్స్ క్లబ్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 100 యూనిట్ల రక్తం సేకరించారు. జాతీయ రక్తదాన దినోత్సవం సందర్భంగా మంగళవారం కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని ప్రిన్సిపల్ జె.సుధాకర్ ప్రారంభించారు. అనంతరం వందే భారత్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తాన్ని సేకరించారు. రెక్టార్ వి.మధుసూదనరావు, కో-ఆర్డినేటర్ పి.సన్యాసిరావు, క్లబ్ ప్రతినిధులు మురళీధరరెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

● 35 కిలోల గంజాయి స్వాధీనం

కరాస, న్యూస్‌టుడే : అక్రమంగా తరలిస్తున్న గంజాయిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటనపై గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాలివి. తమిళనాడుకు చెందిన ఐదుగురు వ్యక్తులు ఏజెన్సీ ప్రాంతంలో గంజాయి కొనుగోలు చేశారు. సరకును మంగళవారం విశాఖపట్నం రైల్వేస్టేషన్‌కు తరలిస్తుండగా.. మార్గమధ్యలో గోపాలపట్నం శ్మశానవాటిక సమీపంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. నిందితులను అదుపులోకి తీసుకుని వారి వద్ద 35 కిలోల గంజాయి, ఐదు చరవాణులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని గోపాలపట్నం సీఐ సురేష్ తెలిపారు.

గాజువాక సినిమాలు

కన్య, శ్రీకన్య, అరుణ, అన్నపూర్ణ, లక్ష్మీకాంత్, విశేష్, మోహినీ 70ఎంఎం: **దేవర**
మినీ మోహినీ: **జోకర్,** మోహినీ: **మత్తు వదలరా–2,** లక్ష్మి: **సత్యం సుందరం**

ఉచిత వైద్య శిబిరం


మందులు అందిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

కరాస, న్యూస్‌టుడే : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా మంగళవారం ఉదయం గీతం ఆసుపత్రి ఆధ్వర్యంలో 52వ వార్డు గౌరీనగర్‌లో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సిబ్బంది హాజరై వివిధ రకాల వైద్య పరీక్షలు చేశారు. పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు ముఖ్యఅతిథిగా హాజరై బాధితులకు మందులు అందజేశారు. పశ్చిమ నియోజకవర్గం భాజపా కన్వీనర్ దాడి పురుషోత్తమ రమేష్ మాట్లాడుతూ... 17 వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. భాజపా ప్రధాన కార్యదర్శి కాశీవిశ్వనాథరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీఎన్.మాధవ్, జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు

పెదగంట్యాడ(వాంబేకాలనీ), న్యూస్‌టుడే : ఈనెల 3 నుంచి 13 వరకు వాంబేకాలనీ వైకుంఠ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త మంత్రి మంజుల, ఆలయ కమిటీ ఛైర్మన్ దొడ్డిరమణ, న్యాయవాది పెంటకోట వెంకట నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఆలయ ప్రాంగణంలో ఉత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు.

● గాజువాక కణితిరోడ్డు ప్రశాంతినగర్‌లో మహాగణపతి వల్లీ దేవసేన ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ అర్చకులు శర్మ ఓ ప్రకటనలో కోరారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కమిటీ ప్రతినిధులు

ఉత్తమ సేవలకు గుర్తింపు


క్రాంతికుమార్‌ను సత్కరిస్తున్న కళాశాల రెక్టార్ మధుసూదనరావు, ప్రిన్సిపల్ సుధాకర్, తదితరులు

కూర్మన్నపాలెం(దువ్వాడ), న్యూస్‌టుడే : స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ ఎల్సెవియర్ పబ్లికేషన్‌తో కలిసి ఇటీవల విడుదల చేసిన ప్రపంచస్థాయి శాస్త్రవేత్తల జాబితాలో విజ్ఞాన్ కళాశాలకు చెందిన క్రాంతికుమార్‌కు చోటు దక్కడం అభినందనీయమని రెక్టార్ వి. మధుసూదనరావు అన్నారు. మంగళవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో క్రాంతికుమార్‌ను సత్కరించారు. సైన్స్ విభాగంలో చేసిన పరిశోధనలకు తగిన గుర్తింపు దక్కిందని ప్రిన్సిపల్ జె.సుధాకర్ ప్రశంసించారు. డీన్ పీఎస్ రవీంద్ర, ఇతర విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


కార్యక్రమంలో పాల్గొన్న తెదేపా నాయకులు, జీవీఎంసీ అధికారులు

కరాస, న్యూస్‌టుడే : జీవీఎంసీ 90వ వార్డులో రూ.17.35 లక్షలతో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు మంగళవారం కార్పొరేటర్ బొమ్మిడి రమణ శంకుస్థాపన చేశారు. స్థానిక లక్ష్మీనగర్ శివాలయం నుంచి ఫైరింగ్‌వాల్ వరకు శిథిలావస్థలో ఉన్న తారురోడ్డు, కాలువల పునర్ నిర్మాణానికి నిధులు వినియోగిస్తామని ప్రజాపనుల విభాగం ఏఈఈ వెంకటలక్ష్మి తెలిపారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కార్పొరేటర్ సూచించారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, తెదేపా నాయకులు ప్రసాద్, అజయ్, మోహన్, లత పాల్గొన్నారు.

● ప్రమాణాల మెరుగునకు కృషి

గాజువాక, న్యూస్‌టుడే : ప్రైవేటు పాఠశాలల్లో విద్యా ప్రమాణాల మెరుగునకు తగిన కృషి చేయాలని ఎంఈఓలు విశ్వనాథ్, సునీత సూచించారు. మంగళవారం జిప్సా నూతన కమిటీ ప్రతినిధులు భాస్కరరావు, శ్రీనివాస్, షణ్ముఖరావు గాజువాక కార్యాలయంలో ఎంఈఓలను కలిశారు. ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతులు అందించారు.

పవన్ దీక్షకు శ్రేణుల మద్దతు

అగనంపూడి, న్యూస్‌టుడే : అగనంపూడి దరి శనివాడ రామాలయం వద్ద 79వ వార్డు జనసేన అధ్యక్షుడు మేడిశెట్టి విజయ్ ఆధ్వర్యంలో మంగళవారం దీపారాధన ఏర్పాటు చేశారు. హిందూ దేవాలయాలపై జరిగిన దాడులను నిరసిస్తూ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేపట్టిన దీక్షకు మద్దతుగా చేపట్టిన కార్యక్రమాన్ని పార్టీ నాయకుడు విందుల వెంకటరమణ ప్రారంభించారు. అధిక సంఖ్యలో మహిళలు, స్థానికులు హాజరై దీపాలు వెలిగించారు. జనసేన నాయకులు ఎం.మురళీ, ఎన్.అప్పలరాజు, ఆర్.రమణ, చినదేముడు తదితరులు పాల్గొన్నారు.


దీపారాధనలో జనసేన నాయకులు, మహిళలు

ఆశ్రమానికి నిత్యావసర సరకులు

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : ఉత్తమ సేవలు అందించే వారికి సమాజంలో గుర్తింపు ఉంటుందని పీసీసీ అధికార ప్రతినిధి జెర్రిపోతుల ముత్యాలు అన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన వుడా కాలనీ జనరేషన్ యువ అనాథ బాలల ఆశ్రమంలో చిన్నారులకు నిత్యావసరాలు, విద్యా సామగ్రి అందజేశారు. భూలోక వర్మ, తదితరులు పాల్గొన్నారు.

● బాధిత కుటుంబానికి సాయం

అగనంపూడి, న్యూస్‌టుడే : అగనంపూడి పరిధి దిబ్బపాలెంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన చిప్పాడ నూకరాజు కుటుంబానికి సాయం చేసేందుకు పెదమడక సర్వహిత ఛారిటబుల్ ట్రస్టు ముందుకొచ్చింది. మంగళవారం బాధిత కుటుంబానికి నిత్యావసర సరకులు అందించారు. ట్రస్టు వ్యవస్థాపకుడు గుదే సుశీలగజేంద్రరావు, ప్రతినిధులు ఎం.మస్తాన్‌రెడ్డి, పట్టా రామఅప్పారావు, ఎస్. గోవిందరావు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

కరాస, న్యూస్‌టుడే : మొక్కలతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమని పలువురు వక్తలు సూచించారు. జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం కొత్తపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు విత్తన బంతులు తయారు చేశారు. సీతాఫలం, నేరేడు, చింత, అశోక, జువ్వి, వెదురు, రావి తదితర విత్తనాలు వినియోగించామని సంస్థ సభ్యుడు ఆదిల్ తెలిపారు. మొక్కల పెంపకంపై బాలలకు అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని హెచ్‌ఎం రత్నమాల పేర్కొన్నారు. కార్యక్రమంలో 89వ వార్డు కార్పొరేటర్ వెంకట రమేష్, విజ్ఞాన్ మహిళా కళాశాల ఎన్‌సీసీ కో-ఆర్డినేటర్ సుహాసిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విత్తన బంతులతో కొత్తపాలెం పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు

అర్హులకు పింఛన్లు అందజేత


పింఛన్ల పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గణబాబు

కరాస, గాజువాక, పెదగంట్యాడ, కూర్మన్నపాలెం, అక్కిరెడ్డిపాలెం, మల్కాపురం : ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి నెలా ఒకటో తేదీ అర్హులకు పింఛన్లు అందిస్తున్నామని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు అన్నారు. మంగళవారం 52, 56, 57, 89, 90వ వార్డుల్లో లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీని ఆయన పర్యవేక్షించారు.

● జీవీఎంసీ 86వ వార్డులో కార్పొరేటర్ లేళ్ల కోటేశ్వరరావు, 76వ వార్డు నడుపూరు, హౌసింగ్‌బోర్డు కాలనీలో కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, బీసీరోడ్డులో కార్పొరేటరు బీఎన్ పాత్రుడు, 75వ వార్డు నెల్లిముక్కు, సీతానగరంలో తెదేపా నగర ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి, అజీమాబాద్, ఇందిరాకాలనీలో మాజీ కౌన్సిలర్ ఎండీ రఫీ, జీవీఎంసీ 68, 69 వార్డుల్లో తెదేపా నాయకులు అలమండ రాజు, అక్కిరెడ్డి శ్రీను, కరణం ముత్యాలనాయుడు, 62వ వార్డు దుర్గానగర్‌లో వార్డు పార్టీ అధ్యక్షుడు మజ్జి మాలినాయుడు, తెదేపా ఎస్సీసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి నీలాపు జోగి ఆధ్వర్యంలో పింఛన్లు అందించారు.


నడుపూరులో కార్పొరేటర్ శ్రీనివాస్



86వ వార్డులో కార్పొరేటర్ కోటేశ్వరరావు

బీరు సీసాతో దాడి.. ఒకరికి గాయాలు


ఆసుపత్రిలో నీరజ్‌కు చికిత్స

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : మద్యం మత్తులో ఇద్దరు మిత్రుల మధ్య వివాదం తలెత్తి, బీరు సీసాతో దాడి చేయడంతో ఒకరికి గాయాలయ్యాయి. ఈ ఘటనపై దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాలివి. అగనంపూడి చెందిన బలిరెడ్డి నీరజ్, శనివాడకు చెందిన గొంతిన హేమంత్ స్నేహితులు. వాళ్లిద్దరూ మంగళవారం రాత్రి వరకు అగనంపూడి బార్‌లో మద్యం తాగారు. ఆ మత్తులో ఇద్దరి మధ్య మాటా, మాటా పెరిగింది. ఆగ్రహించిన హేమంత్ తన చేతిలో ఉన్న సీసాతో నీరజ్‌ను కొట్టడంతో, ఆయన తల, ముఖంపై గాయాలయ్యాయి. స్థానికులు నీరజ్‌ను ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు హేమంత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు హేమంత్‌పై ఇప్పటికే గాజువాక పోలీస్‌స్టేషన్‌లో రెండు కేసులు ఉన్నాయని పోలీసులు పేర్కొన్నారు.

నేడు వినియోగదారుల సమావేశం

పెదగంట్యాడ: రాష్ట్ర వినియోగదారుల హక్కుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం పెదగంట్యాడ వికాస్‌నగర్ బాలగౌరీ ఫంక్షన్ హాల్లో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు సంస్థ ఛైర్మన్ పెంటకోట వెంకటనాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, గణబాబు హాజరవుతారన్నారు.